నవతెలంగాణ
మెదక్
1
శుక్రవారం | 21 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

అక్రమ ఇసుక ఫిల్టర్లను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు



నవతెలంగాణ-కంది

మండలంలోని బ్యాతోల్ నక్క వాగు పరిసరాలపై అక్రమ ఇసుక తయారు చేస్తున్న పిల్టర్ల పై గురువారం రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఒక హిట్యాచి, రెండు ట్రాక్టర్లను, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తహసీల్దార్ విజయలక్ష్మి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ ఐ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

మైనర్ బాలికపై లైంగికదాడి

నవతెలంగాణ- డెస్క్

ఓ మైనర్ బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం రాత్రి సంగారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని వసల్వాది గ్రామ సమీపంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల వయసు గల చిన్నారిని గుర్తు తెలియని ఇద్దరు యువకులు మాయమాటలు చెప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకెళ్లారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు చిన్నారి పై లైంగిక దాడికి పాల్పడ్డారు. అభం శుభం తెలియని చిన్నారికి తీవ్ర రక్త స్రావం కావడంతో కేకలు పెట్టింది.. చిన్నారి అరుపులు వినబడడంతో సమీపంలో ఉన్న స్థానికులు వెళ్లి ఒకడిని పట్టుకొని చితక బాదారు. మరో వ్యకి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

డంపింగ్ యార్డు గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించాలి







- ప్రజా ఉద్యమాలను నిర్బంధాలతో అణచివేయలేరు
- జిల్లా కలెక్టర్ ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదించాలి
- చెత్త పోసేందుకు ప్రత్యామ్నాయాలు వెతకండీ
- ప్యారానగర్‌లో చెత్త పోస్తామంటే ప్రజలు ఒప్పకోరు
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా, వినతి
- వేలాదిగా తరలి వచ్చిన నల్లవల్లి, గుమ్మడిదల ప్రజలు
- కేకే భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్యార్యానగర్‌లో జీహెచ్ఎంసీ పెట్టనున్న డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయడం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచించాలని, ప్రజా ఉద్యమాలను నిర్బందాలతో అణచివేయాలని చూస్తే ప్రజలు మరింత తిరగబడతారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేకే భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి గుమ్మడిదల, నల్లవల్లి, ప్యారానగర్ ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నందున అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజల పక్షాన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఏకపక్షంగా డంపింగ్ యార్డ్ పెట్టాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. గుమ్మడిదల ప్రాంతమంతా పచ్చటి పాడి పంటలతో కళకళలాడుతదని, నిత్యం కూరగాయలు, ఇతర పంటలు హైదరాబాద్‌కు సరఫరా అవుతాయన్నారు. ప్యారానగర్‌కు ఒక పక్క పచ్చటి అడవులు, మరో పక్క ఎయిర్‌ఫోర్స్ ఉన్నాయనే విషయాల్ని సైతం అధికారులు విస్మరించి గుడ్డిగా చెత్త డంపింగ్ యార్డ్ పెట్టాలని నిర్ణయాలు తీసుకోవడం అనాలోచిత చర్య అన్నారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని 17 గ్రామాలకు చెందిన 40 వేల మంది ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రజలంతా రోడ్లెక్కి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా జిల్లా కలెక్టర్ స్పందించకపోవడం సరైంది కాదన్నారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని కోరుతూ ప్రజలు పోరాడుతున్నందున వాస్తవ పరిస్థితుల్ని గమనించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన భాద్యత జిల్లా కలెక్టర్‌పై ఉన్నదన్నారు. గుమ్మడిదల మండలమంతటా పోలీస్ బలగాల్ని మోహరించి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిర్బంధాల ద్వారా ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే ప్రజలు మరింత చైతన్యంతో తిరగబడతారని స్పష్టం చేశారు. తక్షణమే పోలీస్ పికెట్‌ను ఎత్తివేసి పోలీసుల్ని వెనక్కు రప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్నంలో పోగయ్యే లక్షలాది మెట్రిక్ టన్నుల చెత్తను పోసేందుకు పచ్చటి అడవులు, పాడి పంటలు పండే పొలాలు, ప్రజలు జీవించే గ్రామాల మధ్య కాకుండా జనజీవనముండే ప్రాంతాల్లో కాకుండా దూరపు కొండల్లో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్యారానగర్-నల్లవల్లిలో డంపింగ్ యార్డ్ పెడితే ఆ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కి ప్రజలు జీవించే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ఇప్పటికే పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం వల్ల జిన్నారం, బొంతపల్లి,పటాన్‌చెరు ప్రాంతమంతా పరిసరాలు, పర్యావరణం దెబ్బతినడం వల్ల అక్కడ ప్రజలు జీవించలేకపోతున్నారన్నారు. డంపింగ్ యార్డ్ పెట్టి పచ్చగా ఉన్న గుమ్మడిదల ప్రాంతాన్ని చెత్తకుంపటి చేయొద్దని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని ప్రజలు 16 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదన్నారు. అందుకే కలెక్టరేట్ ఎదుట ధర్నా, ర్యాలీ చేశామన్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమాన్ని ఇందిరాపార్క్ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు ఆలోచించి డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, ఆ పోరాటంలో సీపీఐ(ఎం) ముందు భాగాన నిలుస్తుందని హామీ ఇచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, ఏజేసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ పెడితే గుమ్మడిదల మండలంలోని 17 గ్రామాలు పడావుపడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు, నిర్బంధాలకు భయపడేది లేదని, ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. శాంతియుత పద్దతుల్లో 16 రోజులుగా పోరాటాన్ని కొనసాగిస్తున్నామని, గ్రామాల్లోంచి ప్రజల్ని బయటికి రాకుండా పోలీస్‌లు నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. తమ న్యాయమైన పోరాటం విజయం సాధించి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎఓకు వినతి పత్రం

ప్యారానగర్-నల్లవల్లి డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ధర్నా అనంతరం కలెక్టరేట్ ఎఓ పరమేశంకు వినతిపత్రం అందజేశారు. గుమ్మడిదల ప్రాంతంలో తక్షణమే పోలీస్ పికెట్‌ను ఎత్తివేయాలని, ప్యారానగర్ భూముల్ని సర్వే చేయాలని, డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని కోరుతు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, రైతులు మాట్లాడుతూ మా ప్రాణాలు పోయినా ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్‌ను పెట్టనీయబోమని స్పష్టం చేశారు. తమ భూముల్ని సర్వే చేయాలని కోరారు. ప్యారానగర్‌లో ప్రభుత్వ భూములే లేవని, అలాంటప్పుడు డంపింగ్ యార్డ్‌కు 152 ఎకరాల్ని ఎలా కేటాయించాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్, ప్రవీణ్‌కుమార్, నాయకులు పాండురంగారెడ్డి, అశోక్, రమేష్ గౌడ్, జేఏసీ నాయకులు కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకరయ్య , సురేష్, మల్లేశ్, శ్రీనివాస్, ఉదయ్, అంజేయులు, తదితరులు పాల్గొన్నారు.

మతపరమైన విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవు

నవతెలంగాణ-మునిపల్లి



మండలంలోని అంతారం గ్రామాన్ని జిల్లా ఎస్పీ రూపేష్ గురువారం సందర్శించారు. ఇటీవల బాలికపై దాడి చేయడంతో గాయాలపాలై చికిత్స పొందుతూ మరణించిన సంఘటన నేపథ్యంలో మృతురాలు ఆలియా బేగం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలు అలియాభేగం తండ్రి ఇస్మాయిల్‌ను కలిసి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు బాధ్యులైన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచామని కుటుంబానికి అండగా ఉంటామని ఇస్మాయిల్‌కు ఎస్పీ రూపేష్ ధైర్యం కల్పించారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకు మతపరమైన అంశాలను జోడిస్తూ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పలువురు పాల్పడుతున్నారని, ఇది మంచిది కాదని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో మతపరమైన విద్వేషాలు రెచ్చగొడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రశాంతంగా కలిసిమెలిసి ఉండే గ్రామంలో ఇరు వర్గాల మధ్య విభేదాల సృష్టించే వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఎలాంటి ఉద్దేశపూర్వకంగా కాకుండా అనుకోకుండా జరిగిన సంఘటన ఇది అని భవిష్యత్‌లో కూడా గ్రామస్తులు అన్ని కులమతాల వాళ్ళు అన్ని వర్గాల వారు కలిసిమెలిసి ఉండాలని ఆయన సూచించారు. ఎస్పీ వెంట సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, సీఐ వెంకటేష్ స్థానిక ఎస్సై రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి



నవతెలంగాణ-మునిపల్లి

అంతారం గ్రామంలో బాలికపై తీవ్రంగా దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పేర్కొన్నారు. ఎలాంటి మానవతా విలువలు లేకుండా బాలికపై దాడి చేసి బాలిక మరణానికి కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆయన విమర్శించారు. ఈనెల 11వ తేదీన సంఘటన జరిగితే 16వ తేదీన బాధితులు ఫిర్యాదు చేసేంతవరకు పోలీసులకు తెలియలేదంటే పోలీస్ వ్యవస్థ ఎంత నిర్లక్ష్య ధోరణిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చునని క్రాంతి కిరణ్ విమర్శించారు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే బాలికను వెంటనే మెరుగైన చికిత్స అందేదని మరణం సంభవించేది కాదని ఈ ఘటనలో దాడి చేసిన వ్యక్తులది ఎంత తప్పు ఉందో, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు శాఖది కూడా అంతే తప్పు ఉందని క్రాంతి కిరణ్ ఘాటుగా విమర్శించారు. అనుకోకుండా జరిగిన సంఘటన కనుక అన్ని వర్గాల ప్రజలు శాంతి సమన్వయంతో ముందుకు పోవాలని ఇందులో కొత్త కోణాలను వెలికి తీయవద్దని ఆయన గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మృతురాలు అలియా బేగం తండ్రి ఇస్మాయిల్‌ను కలిసి మనోధైర్యాన్ని కల్పించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇస్మాయిల్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని పిల్లల చదువులకోసం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బారాస నాయకులు సాయికుమార్, శశి కుమార్ గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఆలయానికి చేరుకున్న శివ స్వాములు



నవతెలంగాణ-న్యాల్ కల్

మల్గి గ్రామంలో శివ స్వాములు నిత్యం అత్యంత వైభవంగా నిష్ఠ నిబంధనలతో ఆచరించారు. శివ స్వాములు శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు చేరుకున్నారు. గురువారం ప్రసిద్ధిగాంచిన శ్రీశైలం ఆలయ మల్లికార్జున క్షేత్రానికి ఇరుముడి సమర్పించారు. ఎంతో భక్తి భావన శివనామస్మరణాలతో ఆలయంలో విశిష్ట పూజలతో దర్శించుకున్నారు. ప్రతి ఏటా శ్రీశైలం దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని మల్గి మాజీ సర్పంచ్ గురు స్వామి జె.మారుతి అన్నారు. వారిలో శివ స్వాములు మారుతి, పాండు రెడ్డి, బాలాజీ గౌడ్, మల్లేష్ గౌడ్, కృష్ణ సాయినాథ్ మహేష్, శ్రీకాంత్, తదితరులు దర్శించుకున్నారు.

అక్రమంగా తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ మైనింగ్ అధికారులు



నవతెలంగాణ-కోహిర్ : మండలంలోని పైడిగుమ్మల్ ఆయా గ్రామాల శివారులో ఎర్రరాయి తవ్వకాలు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, అసైండ్, ఇనాం, పట్టా భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న రెవెన్యూ మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తవ్వకాల వల్ల పెద్ద గుంతలుగా ఏర్పడి ప్రమాదంగా మారుతున్నాయని పప్రజలు వాపోతున్నారు. సరిహద్దులు మారుతూ రంగారెడ్డి జిల్లా మరుపల్లి మండలంలో గ్రామాలలో ఎర్రరాయి భారీగా తరలింపు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని ఈ దందాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

అనుమానంతో నలుగురు నిందితుల అరెస్టు

నవతెలంగాణ-కోహిర్



మండలంలోని కవేలి గ్రామ చౌరస్తా వద్ద ఎస్సై సతీష్‌తోపాటు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకటేశం కానిస్టేబుల్ సుధాకర్ శివరాం ఓం దేవ్ నవీన్ రెడ్డి కలిసి గురువారం ఉదయం ఐదు గంటలకు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలలో ఆటోలో ఉన్న నలుగురిని విచారించగా వారు సరియైన సమాధానం ఇవ్వక పోవడంతో అనుమానం వచ్చి ఆటోలను తనిఖీ చేశారు. అందులో చాకు ఐరన్ రాడ్ తో పాటు కట్టెలు ఉండడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- సుమారు 4.50 కోట్ల విలువ గల పల్లాడియం కార్బన్ స్వాధీనం.
- పోలీసుల అదుపులో ఆరుగురు నేరస్తులు
- మారుతి సుజుకి ఫ్రాన్స్ కార్ , 6-సెల్ ఫోన్లు సీజ్.
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి దాదాపు రూ.4.50 కోట్ల విలువ చేసే పల్లాడియం కార్బన్‌ను స్వాధీం చేసుకున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సదాశివపేట పోలీసు స్టేషన్ పరిదిలో యావాపూర్ గ్రామంలో గల అరీన్ లైఫ్ సైన్సెస్ యూనిట్-3 కంపెనీలో జరిగిన పల్లాడియం కార్బన్ దొంగతనం గురించి అరీన్ లైఫ్ సైన్సెస్ సీనియర్ హెచ్ ఆర్ మేనేజర్ మజ్జి సూరప్పల నాయుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సదాశివపేట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నూతన సాంకేతికత/ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా చేసుకొని మద్దికుంట చౌరస్తాలో ఆరుగురు నేరస్థులను పట్టుకొని, వారి వద్ద నుంచి దొంగిలించబడిన 96 కిలోలా పల్లాడియం కార్బన్ ను స్వాధీనపరుచుకోవడం జరిగింది. నేరస్థుడు సాంబశివుడును, అతని గ్యాంగ్ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 120 కిలోలు పల్లాడియం కార్బన్‌ను స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.4.5 కోట్లు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ కేసు చేదనలో కృషి చేసిన సదాశివపేట ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, సిసియస్, ఇన్స్పెక్టర్ శివ కుమార్, కొండాపూర్ ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్, పి.రాము నాయుడు ఇన్స్పెక్టర్, ఎస్ఐ శ్రీకాంత్, కొండాపూర్ ఎస్ఐ హరి శంకర్ గౌడ్ సిబ్బందిని ఎస్పీ అభినందించి, రివార్డులు ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డంప్ యార్డ్ ను వెంటనే రద్దు చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- నర్సాపూర్ ప్రజానీకం ప్రత్యక్ష పోరాటానికి దిగాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం



నవతెలంగాణ-నర్సాపూర్

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ కేంద్రంగా డంప్ యార్డు నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధపడడం సరైనదికాదని రౌండ్ టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. నర్సాపూర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో గురువారం కదారి నాగరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మల్లేశం మాట్లాడుతూ నర్సాపూర్ ప్రాంతం పూర్తిగా అడవి ప్రాంతమని, ఇక్కడికి డంప్ యార్డు తీసుకురావడమంటే ప్రజల ఆరోగ్యాలు దెబ్బతీయడమే తప్ప మరొకటి కాదన్నారు. డంప్ యార్డు నిర్మాణం జరిగితే అక్కడి నుంచి వచ్చే వరద నీరు మూలంగా భూగర్భ జలాలు దెబ్బతినడంతో పాటు, నర్సాపూర్ రాయరావు చెరువు అలుగు పారితే నర్సాపూర్ మండలం, హత్నూర మండలం గ్రామాలు నష్టపోతాయన్నారు. హత్నూర మీదుగా మంజీరా నదిలో వరద నీరు కలిసి తాగడానికి కూడా పనికిరాకుండా పోయి తీవ్ర కరువు ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రాంతంలో ఇప్పటికి ఎలాంటి కలుషితం లేకుండా ప్రజలు దొరికిన పని చేసుకుంటున్నారన్నారు. డంప్ యార్డ్ ఏర్పడితే వాయు కాలుష్యం జల కాలుష్యం కావడంతో అనారోగ్యంతో పాటు పుట్టే పిల్లలు దివ్యాంగులుగా పుట్టే పరిస్థితులు వస్తాయని గుర్తుచేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఖలీక్ మాట్లాడుతూ ప్రజలు డంప్ యార్డుకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ప్రజలు ప్రత్యక్ష పోరాటాలకు రావాలన్నారు. లోకసత్తా, బీఎస్పీ నాయకులు శేఖర్, నాగేందర్, జనార్దన్ మాట్లాడుతూ ఈ సమస్య కేవలం పార్టీల పరంగా కాకుండా అందరూ ఏకమై ప్రజా సమస్యగా గుర్తించి ప్రభుత్వం వెంటనే డంప్ యార్డు రద్దు చేసే వరకు పోరాటాలు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఉద్యమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, చంద్రం, విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకుడు రవి హనుమంతుకు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్ చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని టెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు రవి హనుమంతు డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'వివిధ ఆపరేటింగ్ పారామితులలో టెర్నరీ ఇంధనంతో ఇంధనంగా ఉన్న ఆర్ సీసీఐ ఇంజిన్ ప్రవర్తన, వ్యాయామ విశ్లేషణ మెరుగుదల' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. సీతారామయ్య గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. రవి హనుమంతు పరిశోధన అధ్యయనం ప్రకారం, అధునాతన దహన చాంబర్ డిజైన్‌తో పాటు, టెర్నరీ ఇంధన మిశ్రమాలు, మెరుగుదల చేసిన ఇంజెక్షన్ పారామితులను ఉపయోగించి, ఆర్ సీసీఐ ఇంజిన్లు ఇంజిన్ సామర్థ్యాన్ని పెంచడానికి, ఉద్గారాలను తగ్గించడానికి స్థిరమైన విధానాన్ని అందిస్తాయి. ఇది వాటిని సాంప్రదాయ డీజిల్ ఇంజిన్‌లకు ఆచరణీయమైన, ఆశాజకమైన ప్రత్యామ్నాయంగా చేస్తుంది. రవి హనుమంతు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

డంపింగ్ యార్డ్ ఏర్పాట్లు నిర్మాణం పనులను వెంటనే నిలిపివేయాలి

- తప్పుడు నివేదికలు పంపిన తహసిల్దార్‌ను విధుల నుంచి తొలగించాలి
- జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల డిమాండ్



నవతెలంగాణ-గుమ్మడిదల

ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా తప్పుడు నివేదికలను ప్రభుత్వానికి పంపించిన తహసీల్దారును వెంటనే విధుల నుంచి తొలగించాలని మండల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం గుమ్మడిదల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారా నగర్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ స్థలం ప్రభుత్వ స్థలం అంటూ తప్పుడు నివేదికలు పంపించిన రెవెన్యూ అధికారుల వల్ల రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు పచ్చ జెండా ఊపిందన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం వల్ల పచ్చని పల్లె వాతావరణంలో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడంతో వ్యవసాయ ఆధారిత ప్రాంతం కలుషితం కావడంతో పాటు వాయు కాలుష్యం నీటి కాలుష్యం కావడంతో పాటు వ్యవసాయదారిత ప్రాంతం కలుసితమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం గమనించి పునరాలోచన చేసి వెంటనే డంపింగ్ యార్డ్ ఎత్తివేసే దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నేటికీ 15 రోజుల నుంచి నిరవధిక సమ్మెలు కొనసాగిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఏ ఒక్కరు కూడా స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని డంపింగ్ యార్డ్ ఎత్తివేసే దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయడానికి నల్లవల్లి గుమ్మడిదల తదితర గ్రామాల రైతులు మహిళలు యువకులు ప్రజలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

మద్యం మత్తులో భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త



నవతెలంగాణ-కంగ్టి

భార్యను కిరాతకంగా గొడ్డలితో నరికి చంపిన సంఘటన కంగ్టి మండలంలోని తుర్కవడగామాలో గురువారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తుర్కవడగామ గ్రామానికి చెందిన చంద్రమ్మ (45) కూలీ పనిచేస్తూ బ్రతికేది. తరుచుగా భర్త గుండప్ప (50) మద్యం తాగి గొడవ చేసేవాడు యధావిధిగా బుధవారం రాత్రి సైతం మద్యం తాగి వచ్చి గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవకు దారి తీయడంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో అతి కిరతకంగా నరికి చంపాడు. ఈ విషయం గురువారం ఉదయం ఇరుగుపొరుగు వారికి తెలియడంతో పోలీసులకు తెలపడంతో ఎస్ఐ నిందితుణ్ణి అదుపులోకి తీసుకుని, శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం హాసుపత్రికి తరలించారు.

హెట్రో యూనిట్ 1 పరిశ్రమలో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి పారిశ్రామికవాడలోనీ హెట్రో యూనిట్ 1 గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలోని హెచ్ బ్లాక్, ఏఎస్ఎఫ్‌డి ఏరియాలో ఒక్కసారిగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన యాజమాన్యం గాయపడ్డ వారిని గుట్టు చప్పుడు కాకుండా ఆసుపత్రికి తరలించారు. కాగా ఇదే పరిశ్రమలో గత ఆరు నెలల క్రితం అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. పరిశ్రమలో భద్రతా ప్రమాణాల లోపం వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిమ్జ్ భూముల రిజిస్ట్రేషన్ కొనసాగించాలి



నవతెలంగాణ-న్యాల్ కల్

న్యాల్ కల్ మండలంలోని మామిడిగి గ్రామ నిమ్జ్ భూ నిర్వాసితులు చేస్తున్న పోరాటం ఆగదని పలువురు రైతు నాయకులు స్పష్టం చేశారు. ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మామిడిగి నిమ్జ్ రైతు నాయకులు నిమ్జ్ భూములకు రిజిస్ట్రేషన్ ఆపోద్దని, బ్యాంక్ రుణాలు రెన్యువల్ చేయాలని పలు సమస్యలతో సంగారెడ్డి కలెక్టర్ ఏవో పరమేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్డిఓ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యంతరం తెలియజేస్తూ అధికారికి దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు మామిడిగి రాజిరెడ్డి, సంజీవరెడ్డి, నాగన్న, సిద్దప్ప, రాజు, సంతోష్ కుమార్, నారాయణ, పలువురు రైతులున్నారు.

బ్యాంక్ కస్టమర్స్‌పై ఉద్యోగి దురుసు ప్రవర్తన



నవతెలంగాణ కోహిర్

కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని ఎస్‌బిఐ బ్యాంకులో ఓ మహిళా ఉద్యోగి బ్యాంక్ కస్టమర్లతో దురుసుగా ప్రవర్తిస్తు ఇష్టానుసారంగ మట్లాడుతున్నారు దిగ్వాల్ ఎస్ బి ఐ బ్యాంక్ లో ఓ కస్టమర్ పాస్ బుక్ ప్రింట్ గురుంచి వెళ్లి తే వారితో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ మీరు ఫోన్ పే, గూగుల్ పే వాడటం ఆపండి అప్పుడు బుక్ ప్రింట్ ఇస్తామని, మీకు మేము బుక్స్ అయిపొతే 40, 50 బుక్స్ ఇవ్వాలా అని కస్టమర్లచే దురుసుగా మాట్లాడుతున్నారు. ఆ మహిళా ఉద్యోగిపై కస్టమర్లు చాలా మంది కోపానికి గురవుతున్నారు. కావున మహిళా ఉద్యోగిపై తాగు చర్యలు తీసుకువాలని బ్యాంక్ ఖాతాదారులు కోరుతున్నారు.

నేడు ఉచిత న్యూరో, ఆర్థో, డయాబెటిక్ వైద్య శిబిరం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ప్రముఖ సాహితీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత న్యూరో, ఆర్థో, డయాబెటిక్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాము, సాహితీలు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో నరాల సమస్యలు, ఎముకల నొప్పులు, షుగర్, బీపీ వంటి సమస్యలపై నిపుణులైన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. సంగారెడ్డి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, శిబిరంలో పాల్గొని తమ ఆరోగ్య సమస్యలకు తగిన సలహాలు, చికిత్స పొందవచ్చని ఆయన తెలిపారు.

జోగిపేటలో ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-జోగిపేట

గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో భాగంగా గురువారం జోగిపేటలోని నియో వివేకానంద ఉన్నత పాఠ శాలలో బీజేపీ అభ్యర్థులు డాక్టర్ అంజిరెడ్డి చిన్న మైల్, మల్కా కొమరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ ప్రహరీ ఆంజనేయులు గౌడ్, మండల ప్రహరీ భూమయ్య, జిల్లా నాయకులు, మృత్యుంజయం పాల్గొన్నారు.

జోగిపేటలో టీజీఎల్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జోగిపేట : జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ 711(టి జి ఎల్ ఏ) ఆధ్వర్యంలో 2025 నూతన క్యాలెండర్‌ను తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ 711 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రజితలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అసోసియేషన్ సంబంధించిన నూతన క్యాలెండర్‌ను తయారు చేసి అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విట్టల్, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, మల్లేశం, అనిత, రాజకుమార్, మంజుల పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



నవతెలంగాణ-రాయికోడ్

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని రాష్ట్ర సమగ్ర శిక్ష కార్య నిర్వహణ అధ్యక్షులు అనిల్ చారి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సమగ్ర శిక్ష కేజీబీవీ ఉద్యోగులకు పే స్కేల్ 60 శాతం ఇవ్వాలని ఆయనను కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్. శంకర్, సమగ్ర శిక్ష ఉద్యోగులు పడాల రవీందర్, మాధవ్, శ్రీధర్ రెడ్డి, సురేందర్, సత్యనారాయణ, రాజిరెడ్డి, రమేష్, దీప్తి, ప్రియాంక, బిందు శ్రీ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

దత్త మందిరం హరినామా సప్తా కార్యక్రమం



నవతెలంగాణ-మనూర్

మండల కేంద్రం నాగల్గిద్దాలోని దత్త మంది రంలో గురువారం సప్తా కార్యక్రమం ప్రారంభిం చారు. శివరాత్రి సందర్భం గా ఏడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తా రు. పాండు రంగ భక్తులు ప్రతి ఏటా ఈ కార్యక్రమం చేపడుతారు.

రవాణాశాఖ మంత్రిని కలిసిన మాజీ ఎంపీటీసీ



నవతెలంగాణ-మనూర్

మండల కేంద్రం అయినా మనూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ రవి గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు విషయాలు మంత్రికి తెలియజేశారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న

వివిధ పార్టీల నాయకులు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో జరిగిన శివాజీ జయంతి ఉత్సవాల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని ఆర్య సమాజ్ మందిరం వద్ద జరిగిన శివాజీ జయంతి వేడుకలు జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా.సిద్దం.ఉజ్వల్ రెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, పట్టణ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నామ రవి కిరణ్, మాజీ యం.పి.టి.సిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



పెండింగ్ స్కాలర్ షిప్ ఫీజు, బకాయిలు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు



నవతెలంగాణ-పుల్కల్ :మండల పరిధిలోని ముద్దయిపేట్ ఎక్స్‌రోడ్ లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970లో కేరళలో ఏర్పడి ఇప్పటివరకు విద్యారంగ సమస్యల పైన అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘనత ఎస్ఎఫ్ఐది అని తెలిపారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల కోసం, ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థు లకు నాణ్యమైన విద్య అందించాలని ఎస్ఎఫ్ఐ పోరాడు తుందన్నారు. నూతనంగా ఏర్పడ్డ బిజెపి ప్రభుత్వం విద్యలో మతోన్మాదాన్ని, కాషాయకరణను తీసుకొచ్చి పూర్తిగా విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందని తెలిపారు. నూతన విద్యా విధానం 20-20 తీసుకువచ్చి విద్యలో కులాన్ని, కుల వృత్తులపరంగా పాఠ్యాంశాలు చేర్పిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నూతన విద్యా విధానం వలన ప్రైమరీ విద్యకు పేద విద్యార్థులు దూరమయ్యే పరిస్థితి ఉందని తెలియజేశారు అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థుల జీవితాలు బాగుపడతాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న విద్యార్థులకు నిరాశే ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందన్నారు. విద్యార్థులు రావాల్సిన స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ 8700 కోట్లు పైచిలుకు పెండింగ్లో ఉన్న పరిస్థితి ఉందన్నారు. ఇంతవరకు కూడా విద్యారంగం పైన స్కాలర్షిప్ల పైన ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించిన దాఖలాలే లేవన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పుల్కల్ మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్. జే. విజయ్. ఉపాధ్యక్షులు, నితిన్, విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి లు, సమీర్ , హరిచరణ్, ఎస్ఎఫ్ఐ పుల్కల్ మండల కమిటీ సభ్యులు , మల్లేశం, కిరణ్, అనిల్ ,శివ, సాయి హరికృష్ణ,పాల్గొన్నారు.

బీమా చట్ట సవరణ బిల్లు 2024ను వ్యతిరేకించాలి

- ఎల్ఐసి బీహెచ్ఈఎల్ ఏఐఐఈఏ అధ్యక్షురాలు తిరుమల దేవి,ప్రధాన కార్యదర్శి గీత స్వామినాథన్, ఉమెన్ సబ్ కమిటీ మెంబర్ ఉమా సుబ్రమనియన్
- బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలి
- బీహెచ్ఈఎల్ ఎల్ఐసి కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-పటాన్ చెరు

బీమా చట్ట సవరణ బిల్లు 2024ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎల్ఐసి బీహెచ్ఈఎల్ బ్రాంచ్ ఏఐఐఈఏ అధ్యక్షురాలు తిరుమల దేవి,ప్రధాన కార్యదర్శి గీత స్వామినాథన్, ఉమెన్ సబ్ కమిటీ సభ్యురాలు ఉమా సుబ్రమనియన్ డిమాండ్ చేశారు. బీమా చట్ట సవరణ బిల్లు 2024ను వ్యతిరేకిస్తూ గురువారం బీహెచ్ఈఎల్ ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి గీత స్వామినాథన్, అధ్యక్షురాలు తిరుమల దేవి, ఉమెన్ సబ్ కమిటీ మెంబర్ ఉమా సుబ్రమనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఒక గంట సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఎల్ఐసిలో సీఐ త్రీ, సీఐ ఫోర్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసిలో అతి పెద్ద ఉద్యోగుల సంఘం అయిన ఏఐఐఈఏకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. బీమా ప్రీమియంపై జిఎస్టి రద్దు చేయాలని అన్నారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడి పరిమితి 74 శాతం నుంచి 100 శాతం పెంచడం, భీమ కంపెనీలకు కంపోసిట్ లైసెన్స్‌ల జారీ, భీమ నిధుల మళ్లింపు, కమిషన్ చెల్లింపుల్లో అస్పష్టత, పాలసీదారుల డేటా రక్షణ లేకపోవడం, మూలధనంలో లోటు వంటి అనైతిక ప్రమాదాలను వ్యతిరేకిస్తూ సమ్మెను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ రంగ భీమా పరిశ్రమ రక్షణ కోసం జరిగే ఈ పోరాటంలో ప్రజలందరూ భాగ్య స్వాములు కావాలని, ఉద్యమానికి మద్దతు అందించాల్సిం దిగా ఈ సందర్భంగా వారు కోరారు.



శ్రీ మంజునాథ ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



నవతెలంగాణ-జోగిపేట

అందోలు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ మంజునాథస్వామి, పార్వతిదేవి, నందీశ్వరుడు, గణపతి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహిం చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్ వర్కల అశోక్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 18వ తేదిన గోపూజ, వరుణాయాసము, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యవచనం, పంచగవ్య ప్రాశన, మాతృక, అంకురారోపణం, తత్తత్ హెూమాలు, 19వ మంటప పూజ, రుద్రా భిషేకం, రుద్రహవనం, ధాన్యాధివాసం కార్యక్రమాలు నిర్వ హించారు. ఉదయం రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి సమక్షంలో గర్త సంస్కారం, మపబలాభిషేకం, 11.22 గంటలకు అనురాధ నక్షత్రయు క్త వృషభ లగ్న పుష్కరాంశమున యంత్రస్థాపన, మూర్తి ప్రతిష్ఠా, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, కళాన్యాస గుడ ఉన్మీలిన ప్రతిష్ఠాంగ హెూమం, బలిప్రధానం, పూర్ణాహుతి, ప్రతిష్ఠాంగ పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పి.నారాయణ మాజి ఎంపీపీ జోగు బాలయ్య, మాజీ సర్పంచులు లింగా గౌడ్, సంగమేశ్వర్, కాళిదాస్ గౌడ్, నాయకులు చాపల వెంకటేశం, గ్రామస్తులు పాల్గొన్నారు

అంబులెన్స్‌లోనే ప్రసవం, పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి



నవతెలంగాణ-వట్ పల్లి

అంబులెన్స్‌లోనే ప్రసవించి పండంటి మగ బిడ్డకు తల్లి జన్మనిచ్చింది ఈ ఘటన మండలంలోని గొర్రెకల్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. 108 సిబ్బంది, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గొర్రెకల్ గ్రామానికి చెందిన ఉసిరిక పల్లి అనిత.(22) ఉదయం పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో ఆశా వర్కర్ సహాయంతో 108 అంబులెన్స్‌లో జగ్గ పేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళుతున్న క్రమంలో గ్రామ శివారులో అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగింది విధి లేని పరిస్థితులలో 108 సిబ్బందితోపాటు ఆశ వర్కర్ చాక చాక్యంతో అదే అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలను ప్రారంభించారు. చికిత్సలు ప్రారంభించడంతో అప్పుడే పుట్టిన బిడ్డ, తల్లి కూడా క్షేమంగా ఉండడంతో 108 సిబ్బంది ఆశా వర్కర్ ఊపిరి పీల్చుకున్నారు. అంబులెన్స్ సిబ్బందిని వైద్యులు అభినందించారు. పండంటి మగ బిడ్డ జన్మించడంతో కుటుంబీకులలో సంతృప్తి వ్యక్తపరిచారు. అనిత తల్లిదండ్రులకు మగసంతానం లేకపోవడంతో పెద్దకూతురును పొరుగు గ్రామానికి పెండ్లి జరిపించి పంపగా రెండవ కూతురు అనితను ఇంటిలో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన శ్రీశైలం అనే వ్యక్తిని అల్లునిగా ఇల్లరికం తెచ్చుకున్నారు. అనిత శ్రీశైలం దంపతులకు మొదట కూతురు జన్మించగా రెండవ కాన్పులు మగ బిడ్డ జన్మించడంతో కుటుంబీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంబులెన్స్‌లో ప్రసవించినప్పటికీ 108 సిబ్బంది ఆశ వర్కర్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ఈఎంటి దేవేందర్ పైలెట్ మల్లేశం 108 సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయి



నవతెలంగాణ-జహీరాబాద్

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఫ్రెండ్స్ కల్యాణ మండపంలో నీలం వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమం ఆయన మాట్లాడుతూ ఈ విధమైన శిబిరాలు నిర్వహించడంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహనతో పాటు మెరుగైన చికిత్సలు అందేందుకు ఆస్కారం ఉంటుంద న్నారు. నీలం వైద్యశాల నిర్వాహకులు శిబిరాన్ని నిర్వహిం చేందుకు ముందుకు రావడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ప్రధానంగా నేడు ప్రజలకు తెలవకుండానే ఒక రకంగా నాశనం చేస్తున్న భూతం క్యాన్సర్ అని, క్యాన్సర్ స్కానింగ్ నిర్వహించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. జ్యోతి ప్రజల వల్ల చేసే శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐ శివలింగం ,నీలం వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ నవాజ్, డాక్టర్ నీలిమ లతో కూడిన 16 మంది వివిధ రోగాల వైద్య నిపుణులు సుమారు 1500 మంది రోగులకు ఉచిత వైద్య సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మహమ్మద్ ఇమ్రాన్, సమీర్ పాల్గొన్నారు.

నిరంతరం ప్రజల్లో ఉంటా

- 12వ వార్డు మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు



నవతెలంగాణ-జోగిపేట

నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రజాసేవలో ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని అందోల్, జోగిపేట మున్సిపల్ 12వ వార్డ్ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు అన్నారు. 5 సంవత్సరాలు కౌన్సిలర్ పదవి పూర్తి అయిన సందర్భంగా కాలనీవాసులు గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ తనకు కౌన్సిలర్‌గా అవకాశం కల్పించిన వార్డు ప్రజలకు రుణపడి ఉంటానని, పదవి ఉన్నా లేకున్నా వార్డు ప్రజలకు అండగా ఉంటానని ఆయన తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాలలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనప్పటికిని కాలనీ అభివృద్ధికి కృషి చేశానన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో కాలనీని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆయన సూచించారు. మీ ప్రేమ, అభిమానం కలకాలం ఇలాగే ఉండాలని కోరుకుంటున్నానన్నారు. తనను సన్మానించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శ్రీరామచంద్రుని విగ్రహ ప్రతిమను ఆయనకు జ్ఞాపికగా అందించి, శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఉలువల శ్రీనివాస్, ఉలువల దుర్గేష్, ఉలువల మల్లేశం పాల్గొన్నారు.

పెత్తందారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-సంగారెడ్డి

రాయికోడ్ మండలం పిప్పడ్పల్లి గ్రామంలో ఎస్సీ కులానికి చెందిన మామిడ్గి సుమన్ చింత చెట్టు ఎక్కి చింతకాయ తెంపాడని కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలో జరిగిన కెవిపిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అతిమేల మానిక్ పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 13వ తేదీన పిప్పడ్పల్లి గ్రామానికి చెందిన చీకూర్తి నీలమ్మ భర్త అమృత్ వ్యవసాయ పొలం వద్ద ఉన్న చింత చెట్టుకు చింతకాయ తెంపి తీసుకురావాలని చెప్పడంతో సుమన్ వెళ్లి చింత చెట్టు ఎక్కి చింతకాయలు తెంపుతుండగా చీకుర్తి లక్ష్మణ్ అతని భార్య మమత నీకు చింతకాయలు ఎవడు తెంపమన్నారని ఇష్టానుసారంగా దూషించినారని మాణిక్ తెలిపారు. తెంపిన చింతకాయలను అక్కడే వదిలేసి వెళ్ళిపోయినారని తెలిపారు. మరుసటి రోజు ఫిబ్రవరి 14వ తేదీన సుమన్ ఇంట్లో ఉన్నప్పుడు చీకూర్తీ లక్ష్మణ్ అతని భార్య మమతా వెళ్లి గల్లపట్టి ఇంటి నుండి గుంజుకొచ్చి కులం పేరుతో అనరాని మాటలు అంటూ దూషించి దాడి చేయడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కె(విపిఎస్) తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పోలీస్ స్టేషన్లో పిటిషన్ ఇచ్చి ఆరు రోజులు గడిచినా ఇప్పటికి ఎటువంటి చర్య తీసుకోకపోవడమేంటని ప్రశ్నించారు. చట్టం పెద్దదారులకు చుట్టంగా మారిందన్నారు. దళితుడు సుమన్ పై దాడి చేసిన అగ్రకుల పెత్తందారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, కెవిపిఎస్ నాయకులు రాజయ్య, బాబురావు, తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రికి 1.08 కోటి రుద్రాక్షలతో మహా శివలింగం

- శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి



నవతెలంగాణ-సంగారెడ్డి

మహాశివరాత్రి సందర్భంగా 1.08 కోటి రుద్రాక్షలతో మహా శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని ఆశ్రమంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివలింగం 18.50 అడుగుల ఉంటుందని పేర్కొన్నారు. 23వ తేదీన ఫసల్వాదిలోని ఆశ్రమంలో రుద్రాక్షలతో తయారుచేసిన శివలింగాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా 1.08 కోట్ల రుద్రాక్షలతో తయారుచేసిన శివలింగానికి భక్తులు అభిషేకం చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం 18 అడుగుల భస్మ శివలింగాన్ని తయారు చేసినట్లు వివరించారు. ప్రపంచంలోనే మొదటిసారిగా రుద్రాక్షలతో శివలింగాన్ని ఆశ్రమంలోనే తయారు చేసినట్లు తెలిపారు. మహాశివరాత్రికి ప్రతి సంవత్సరం ఒక్కో రకం శివలింగాన్ని తయారు చేసి భక్తులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో మహాశివరాత్రికి పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, ప్రశాంత్ కుమార్, దారం సంజయ్ కుమార్, కృష్ణ మూర్తి, రాము, విట్టల్ దాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం పట్టని ప్రభుత్వాలు


- నాణ్యతలేని భోజనాలు వడ్డిస్తున్న హెూటళ్లు
- నానా రకాల రోగాల గురవుతున్న ప్రజలు...!
- ఫిర్యాదులు చేస్తేనే తప్ప పట్టించుకోరా?

నవతెలంగాణ-జహీరాబాద్

అన్నదాతగా పేరుగాంచిన సంగారెడ్డి జిల్లాలోని పలు హెూటల్లో యజమానుల నిర్వాహణ లోపం అధికారుల నిర్లక్ష్యం పాలకులు పట్టించుకోకపోవడంతో జిల్లాలోని హెూటళ్లలో భోజనం చేయాలన్న జంకే పరిస్థితి నెలకొంది. గత నెల రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని పలు హెూటళ్లలో భోజనం చేసిన యాత్రికులు , భోజన ప్రియులు వివిధ రకాల అనారోగ్యాలకు గురై న విషయం తెలిసిందే. అయినప్పటికీ కోలుకోనటువంటి అధికారులు పాలకు లు ఎక్కడైతే ఫిర్యాదు వస్తుందో అక్కడే తనిఖీలు చేస్తున్నారు తప్ప మిగతా హెూటలలోని నాణ్యత ప్రమాణాలను పరిశీలించడంలో పూర్తిగా విఫలమ వుతు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని జహీరాబాద్, పటాన్చెరు, సదాశివ పేట, సంగారెడ్డి, జోగిపేట్, నారాయణఖేడ్ పట్టణాలలో ఉన్న హెూటళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహీర్, జహీరాబాద్, ఝరాసంగం నాల్కల్, మోగిడంపల్లి, రాయికోడ్ మండల కేంద్రంతో పాటు కొన్ని హెూటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, విచ్చలవిడిగా నడుస్తున్నాయి. వీటిలో నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. వినియోగదారులు సైతం అవి లెక్క చేయకుండా విచ్చలవిడిగా తిని అనారోగ్యానికి గురవుతున్నారు. కొన్ని బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో, టిఫిన్ సెంటర్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు రోజుల తరబడి నిల్వచేసి వాటిని విక్రయించి లక్షలు గడిస్తు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల అండదండలతో తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో అధికారులు తూతూ మంత్రంగా వచ్చి కొన్ని ఆహార పదార్థాలను పరిశీలించి వాటిని ల్యాబ్‌కు పంపినట్లు తెలిపి చేతులు దులిపేసుకుంటున్నారు. కేవలం ఏదైనా సమస్య వస్తే తప్ప మిగతా సమయంలో కనీసం వచ్చి తనిఖీలు చేసిన దాఖలాలు ఇప్పటికీ లేవు. ఫలితంగా హెూటళ్లు, టిఫిన్ సెంటర్లో ఇష్టమొచ్చినట్లు నియమ నిబంధనలకు విరుద్ధంగా బిర్యానీ హెూటల్లు, ఫుల్ మీల్స్ హెూటల్లు, బార్లు, రెస్టారెంట్లు , టిఫిన్ సెంటర్లు బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఒకవైపు బర్డ్ ఫ్లూతో కోళ్ల మాంసాన్ని విక్రయించేందుకు నిషేధించిన ప్రభుత్వం హెూటల్‌లో మాత్రం చికెన్ బిర్యానీలు దర్జాగా వండి విక్రయిస్తున్నారు. ఇప్పటికే సంగారెడ్డి జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న పలు హెూటలలో ఫుడ్ పాయిజన్ కావడంతో ఆ హెూటళ్లపై అడపా దడపా చర్యలు తీసుకున్నటువంటి అధికారులు తిరిగి వాటి వైపు చూసిన దాఖలాలు లేవు. జాతీయ రహదారి 65 క ఇరువైపులా వెలసిన ధాబాలలో రాత్రి వేళల్లో ముందు షట్టర్ బంద్ చేసి వెనక డోర్ నుంచి ముమ్మరంగా వ్యాపారం నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదకరంగా మారిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు

ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వహకులు వివిధ రకాల చికెన్ మటన్ మంచూరియా డిస్కు తయారు చేస్తూ రకరకాల నిషేధిత కలర్స్‌ను సైతం వాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కుళ్లిపోయిన చికెన్ మటన్ ముక్కలను కలుపుతూ తక్కువ ధరకు విక్రయించడంతో ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు కూడా శ్రద్ధ చూపుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకులు వాడేటటువంటి కోడిగుడ్లు నాసి రకంగా ఉంటున్నాయని వాటిపై అధికారులు దృష్టి సారించాలని వినియోగదారులు కోరుచున్నారు.



అధ్వాన్నంగా రెస్టారెంట్ కిచెన్లు...

వివిధ హెూటల్లు రెస్టారెంట్లు వారి యొక్క కిచెన్ల పరిస్థితి దారుణంగా ఉంది. కనీసం పరిశుభ్రతను పాటించకపోవడంతో ఆ హెూటళ్ల నుంచి వస్తున్న వ్యర్థాలతో డ్రైనేజీలన్నీ కంపు కొడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు ప్రధానంగా ఆంధ్ర మెస్సులు రెస్టారెంట్లు నిర్వాహకులు వారి హెూటల్ నుండి వచ్చేటటువంటి వ్యర్థాలు నేరుగా మున్సిపల్ డ్రైన్స్‌లో పడే వధంగా చర్యలు తీసుకోవడంతో డ్రైన్స్ మొత్తం కంపు కొడుతున్నాయని ఈ విషయమై పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ చాయ్ దుకాణాల్లో ఏంటి.....!

జాతీయ రహదారికురువైపులా ఉన్న వివిధ పేర్లతో నిలిచిన ఛాయ దుకాణాల్లో రాత్రింబవళ్లు వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఛాయ్‌ని చిక్కగా చేయడంతో పాటు రుచికరంగా చేసేందుకు పలు రకాల కెమికల్స్‌ను అందులో కలుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఫుడ్ ఇన్స్పెక్టర్ ప్రతివారం తనిఖీలు నిర్వహించి కలుషిత ఆహారాన్ని నిరోధించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

నవతెలంగాణ
మెదక్
శుక్రవారం | 21 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై శిక్షణ కార్యక్రమం



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రం సమైక్య కార్యాలయంలో వివోఏ లకు గ్రామ సంఘం ఆఫీస్ బేరర్ లకు గ్రామ సంఘం సబ్ కమిటీ మెంబర్లకు ఆరోగ్యం, పోషణ, పాశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, జెండర్ అంశాలపై గురువారం మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి స్వయం సహాయక సంఘం ద్వితీయ సమావేశాలు నిర్వహించుకొని ఆరోగ్యమే మహాభాగ్యం ఆహారంతో ఆరోగ్యం పోషకాలు నష్టపోకుండా వంట చేసే పద్ధతులు పిల్లలు పోషణ రక్తహీనత వేయి రోజుల ప్రాముఖ్యత పిల్లల పోషణకు పాటించే పద్ధతులు చేతుల శుభ్రత సమతుల్య ఆహారం చెత్త నివారణ పర్యావరణ పరిశుద్ధం మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. స్వయం సహాయక సంఘాలు ప్రతినెల ద్వితీయ సమావేశాలు నిర్వహించుకొని పై అంశాలపై అవగాహన కల్పించాలని శిక్షణలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు నవనిత, కార్యదర్శి ప్రమీల, కోశాధికారి శ్యామల, ఏపిఎం శంకరయ్య సీసీలు బయట సిబ్బంది కృష్ణవేణి, లలిత, ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి, అంగన్ బట్టి టీచర్లు, వివోఏలు గ్రామ సంఘ ఆఫీస్ బేరలు సబ్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-నిజాంపేట

పట్టబద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఫుట్యూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఉమ్మడి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో గ్రాడ్యుయేట్స్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పంజా మహేందర్, మారుతి, నదురుద్దీన్, వెంకట్ గౌడ్, తిరుమల స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ స్లిప్పుల పంపిణీ



నవతెలంగాణ-నిజాంపేట:

ఉమ్మడి మెదక్, అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులకు ఓటర్స్ స్లిప్‌లను అందజేయడం జరిగిందని రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇమద్ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని నార్లపూర్ గ్రామంలో బిఎల్ఓ కు ఎమ్మెల్సీ ఓటర్ల స్లిప్పులను అందజేసి రిసీవ్డ్ ను సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న నిర్వహించే పట్టభద్రుల ఎన్నికల్లో పట్టబద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఆర్టిజన్ ఉద్యోగుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టిజన్ ఉద్యోగులు తలపెట్టిన విద్యుత్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని స్థానిక పోలీసులు భగ్నం చేశారు. ఉదయము తెల్లవారుజామున ఇండ్ల వద్దకు వెళ్లి ముందస్తుగా అరెస్టు చేసి తీసుకురావడం జరిగింది. ఆర్టిజన్ ఉద్యోగస్తులు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఆర్టిజన్ ఉద్యోగస్తులను చిన్నచూపు చూస్తుందన్నారు. అక్రమ అరెస్టులు సరికావన్నారు . బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కాంగ్రెస్ పార్టీ ఆర్టిజన్ ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని అన్నారని తెలిపారు. ప్రభుత్వము వెంటనే స్పందించి ఆర్టిజన్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. గుడ్ల రాజు, బ్యాగరీ చంద్రము. తదితరులున్నారు.

నేడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటన



నవతెలంగాణ-తూప్రాన్

ఫిబ్రవరి 21న తూప్రాన్‌లో కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి పర్యటించనున్నారని మున్సిపల్ బిజెపి అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ తెలిపారు. మంత్రితో పాటు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు,మెదక్, సిద్దిపేట్,సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు హాజరవుతున్నట్లు తెలిపారు.

టీవీఏసి జేఏసీ చైర్మన్ ను అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ-తూప్రాన్

ఫిబ్రవరి 20న చేపట్టిన విద్యుత్ సౌధ ధర్నా కార్యక్రమాన్ని అడ్డుకొని టీవీఏసీ జేఏసీ చైర్మన్ బి.ఎస్.స్వామి ని తూప్రాన్ పోలీసులు గురువారం ఉదయం అరెస్టు చేసి,పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా టీవీఏసి జేఏసీ చైర్మన్ బి.ఎస్.స్వామి మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యుత్ కార్మికుల ప్రధాన డిమాండ్ ఆర్టిజన్ కన్వర్షన్ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని అరెస్టులతో ఆపలేరని, ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మా డిమాండ్లను పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పొడన్ పల్లిలో స్వయంపాలన



నవతెలంగాణ-పాపన్నపేట

మండల పరిధిలోని పొడ్చన్ పల్లి పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెడ్మాస్టర్‌గా అఖిల్, కలెక్టర్గా భవాని, డీఈవోగా చరణ్ కుమార్, ఉపాధ్యాయులుగా స్వాతి, కీర్తిక, భరత్, సృజన్, వ్యవహరించారు. వీరి పనితీరును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాజిల్ హుస్సేన్, ఉపాధ్యాయులు వనిత, స్రవంతి ప్రవీణ్ కుమార్, సతీష్ గౌడ్ కనకారెడ్డి, దుర్గయ్య రమేష్ ,నాగరాజు తదితరులు పరిశీలించారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న వై.నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

మునిపల్లి మండలం కంకోల్ గ్రామంలోని లక్ష్మీ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన ఝరాసంఘం మండలం గుంతమర్పల్లి గ్రామం కేతకి సంఘమేశ్వర ఆలయ మాజీ చెర్మెన్ జి.నర్శింహ గౌడ్ బావమరిది భరత్ గౌడ్ వివాహానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం హాజరయ్యారు. నూతన వదు వరులను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ వివాహ వేడుకల్లో నాయకులు జి.నర్శింలు, షాహీద్ పటేల్, చెంగల్ జైపాల్, పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సు సీఐటీయూ లక్ష్యం

- సుగుణ ఫుడ్స్ డ్రైవర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్.



నవతెలంగాణ-శివ్వంపేట

కార్మికుల శ్రేయస్సు కోసం సీఐటీయూ ప్రతి నిత్యం పోరాటం చేస్తుందని, కార్మిక శ్రేయస్సు సీఐటీయూ లక్ష్యమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్ అన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాష్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సుగుణ ఫుడ్స్ పరిశ్రమలో గుర్తింపు ఎన్నికల సందర్భంగా గురువారం గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షులు జె మల్లికార్జున్ మాట్లాడుతూ కార్మికులు శ్రేయస్సు సీఐటీయూ లక్ష్యమని, చారిత్రాత్మక వేతన ఒప్పందం చేసి, కార్మికులను పర్మినెంట్ చేసిన చరిత్ర సిఐటియుకే ఉందని ఆయన గుర్తుచేశారు.21న శుక్రవారం జరిగే కార్మిక గుర్తింపు ఎన్నికల్లో భారీ మెజారిటీతో కార్మిక వర్గం గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.భవిష్యత్ కాలంలో మెరుగైన వేతన ఒప్పందంతోపాటు, కార్మిక శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తానని అన్నారు.మెదక్ జిల్లాలో పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికులచేత పరిశ్రమ యజమాన్యాలు 10 నుంచి 12 గంటలు పని చేయిస్తున్నారని,వలస కార్మికులకు వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయకుండా పరిశ్రమలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సీఐటీయూ పోరాటాలు చేసిన చోట కనీస వేతనాలు పరిశ్రమల యజమాన్యాలు అమలు చేస్తున్నాయని, రాబోయే కాలంలో పరిశ్రమలలో కనీస వేతనాలు అమలు చేయని చోట అమలు చేసే విధంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పరిశ్రమలలో లేబర్ అధికారుల పర్యవేక్షణ కరువైందని,కనీస వేతనాలు అమలు చేయని పరిశ్రమలపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత 10 సంవత్సరాలుగా 71 షెడ్యూల్ పరిశ్రమలలో కనీస వేతనాల జీవోలను సవరించలేదని, గతంలో కనీస వేతనాల సలహా మండలి సభ్యులుగా ఉన్న సమయంలో ఎస్సీసార్లు కనీస వేతనాలు సవరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా చేసి కార్మికుల హక్కులను హరిస్తుందని,గత ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కార్మికుల పట్ల మొండివైఖరిని చూపుతోందని,రాబోయే రోజులలో సిఐటియూ ఆధ్వర్యంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గంతో పాటు, కేంద్ర కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు ఒకరే లేబర్ అధికారి ఉండడంతో పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని, మెదక్ సిద్దిపేట జిల్లాలకు జిల్లా లేబర్ అధికారి ని నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మల్లేష్,యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి, పరిశ్రమ ప్రధాన కార్యదర్శి యాదగిరి,మల్లగౌడ్, భాస్కర్, కుమార్, శేఖర్, నాగరాజు, ఇంద్రేష్ రవీందర్ , రాజశేఖర్ ఇండస్ మెడికేర్ పరిశ్రమ నాయకులు తిరుపతి సుగుణ హేచరీ జనరల్ సెక్రెటరీ సాయిలు,రాజు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చిన తర్వాత 57 వేల ఉద్యోగాలు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 57 వేల ఉద్యోగాలను కల్పించిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయిన తర్వాత కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావులు హత్య రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన అభివృద్ధి ఏమైనా ఉందా అంటే కెసిఆర్ కుటుంబానికి నీళ్లు, నిధులు, నియామకాలు వచ్చాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు ఉద్యోగాలు లేక రోడ్డుపై తిరిగారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు అంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజి రెడ్డి పాల్గొన్నారు.



బీవీఆర్ఐటీలో 'బాహ సే ఇండియా 2025' ప్రారంభం

- ఘనంగా పదో వార్షికోత్సవ వేడుకలు
- వోల్వో, డైమ్లర్, ఏవీఎల్, అల్టైర్, టాటా మోటార్స్ వంటి ప్రముఖ ఆటోమోటివ్ సంస్థలు హాజరు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో ఈ బాహా సే ఇండియా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఇంజినీరింగ్ సృజనాత్మకత, అద్భుత ప్రదర్శనకు నిలయమైన 'బాహ సే ఇండియా 2025' మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గల బీవీ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (హ్యూమన్ రిసోర్సెస్) సిమోనా అడెలినా పోపోవిసీ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. గౌరవ అతిథులుగా శ్రవణ్ కుమార్, టెరిటరీ మేనేజర్, బీపీసీఎల్, హైదరాబాద్‌బీ మయాంక్ ధింగ్రా, అసిస్టెంట్ ఎడిటర్, ఆటోకార్ ప్రొఫెషనల్‌బీలు హాజరయ్యారు. బాలరాజు సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు, నిర్వాహక కమిటీ, బాహ సే ఇండియాబీ రవిచంద్రన్ రాజగోపాల్, వైస్ చైర్మన్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీబీ డాక్టర్ కె.సి. వోరా, సలహాదారు, బాహ సే ఇండియాబీ మనోనీత్ సింగ్, జాయింట్ కన్వీనర్, బాహ సే ఇండియాబీ ప్రణవ్ ఖటేకర్, కో-కన్వీనర్, బాహ సే ఇండియాబీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక అంతర్ కళాశాలల ఈవెంట్ సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ (ఎస్ఏఈ), శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్ఏఈ బాహ సే ఇండియాతో కలిసి నిర్వహిస్తుంది. ఈ ఏడాది బాహ సే ఇండియా పదో వార్షికోత్సవాన్ని నిర్వహిస్తుంది. విద్యుత్ వాహనాల అభివృద్ధికి, స్థిరమైన ఇంజినీరింగ్‌కు మార్గదర్శిగా నిలిచిన ఈ విభాగం, దేశవ్యాప్తంగా యువ ఇంజినీరింగ్ ప్రతిభను ప్రోత్సహించే ఒక గొప్ప వేదికగా మారింది. విద్యుత్ ఆధారిత ఆల్-టెర్రైన్ వాహనాల (ఏటీవీల) రూపకల్పన, తయారీ, పనితీరును పరీక్షించే ఈ పోటీ దేశంలోని ప్రతిభావంతులైన యువ ఇంజినీర్లకు అసాధారణ వేదికగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రెనాల్ట్ నిస్సాన్‌లతో పాటు బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సం, హైదరాబాద్ టెరిటరీ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఆటోలివ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ శివకుమార్ సుధాచంద్రన్, పరశురామ్ పాకాల మాటాడారు. ఈ కార్యక్రమంలో ఆటోకార్ ప్రొఫెషనల్, అసిస్టెంట్ ఎడిటర్ మయాంక్ ధింగ్రా, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, బాహ సే ఇండియా అడ్వైజర్ డాక్టర్ కేసీ వోరా, బాహ సే ఇండియా జాయింట్ కన్వీనర్ మనోనీత్ సింగ్, కో కన్వీనర్ ప్రణవ్ ఖటేకర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దుబే డీజీఎం కాంతారావు మేనేజర్ పాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీలతో కలెక్టర్ ముచ్చట్లు



నవతెలంగాణ-చిన్న శంకరంపేట: మండల కేంద్రంలో కౌలు రైతు దదువాయి నర్సింలు రెండు ఎకరాలు సాగు చేస్తున్నారు ఆయన వ్యవసాయ పొలంలో కలుపుతీస్తున్న కూలీలతో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముచ్చటించారు. గురువారం మెదక్ చేగుంట ప్రధాన రహదారి పరిసర ప్రాంతంలో ఉన్న వ్యవసాయ పొలంలో మహిళా కూలీలు కలుపుతీస్తున్నారు. వాళ్ల వద్దకు వెళ్లిన కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎలాంటి పంటలు అధికంగా సాగు చేస్తున్నారని అడిగి తెలుసుకు న్నారు. పంటలు అధిక దిగుబడి సాధించాలంటే వ్యవ సాయ అధికారులతో తగిన సూచనలు సలహాలు తీసుకో వాలని సూచించారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చుని జిల్లా కలెక్టర్ రైతులకు తెలియజేశారు. సాగునీటి వసతి విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. పంటల సంరక్షణకు తీసుకుంటున్న రక్షణ చర్యలను రైతులు ఆయనకు వివరించారు. గ్రామాలలో తాగునీటి సరఫరా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యం గా జిల్లాలో వరి పంటలకు పురుగు సోకి నష్టం వాటిల్లే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించగా సస్యరక్షణ చర్యలపై ఆరా తీయడం జరిగిందని వ్యవసాయ అధికారులు నిత్యం రైతుల మధ్య ఉంటూ తగు సూచనలిస్తూ పురుగు మందులు పిచికారి చేసి పురుగు నివారణకు చేపట్టే చర్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఎరువులు పురుగు మందులు కొరతలేదని, మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పంట పొలాలను సందర్శించి సస్యరక్షణ చర్యలు అధిక దిగుబడును సాధించే విధానాలపై రైతులుకు అవగాహన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయ అధికారులు లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

- అఖిలపక్ష నాయకుల డిమాండ్



నవతెలంగాణ-వెల్దుర్తి

రుణమాఫీ పూర్తయిన రైతులకు తిరిగి పంట రుణాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న కెనరా బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం మాసాయిపేట మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద రైతులతో కలిసి అఖిలపక్ష నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల లోపు రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వకుండా సివిల్ స్కోరు ఉన్న రైతులకు మాత్రమే రుణాలు ఇస్తామని బ్యాంకు మేనేజర్ ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న పంట రుణాలే కాకుండా ఇతర రుణాలను కూడా చెల్లించాలని రైతులను ఇబ్బంది పెడుతున్నారని వారు ఆరోపించారు. కెనరా బ్యాంకులో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కెనరా బ్యాంకు ద్వారా రైతులకు రుణాలు అందే విధంగా చూడాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేందర్ రెడ్డి, సిద్దిరాములు గౌడ్, కోదండపురం నరసింహులు, వేణు, పవన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి .శంకర్



నవతెలంగాణ-నిజాంపేట

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం నిజాంపేట్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు పి.శంకర్ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులు కేటాయించి తమ హామీని తామే తుంగలో తొక్కిందన్నారు రానున్న బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారని చెప్పారు పాఠశాలలో మధ్యాహ్న భోజనం, గురుకులాలలో ,సంక్షేమ వసతి గృహాలలో పౌష్టికాహారం అందించాలని కోరారు. ప్రభుత్వ విద్యాలయంలో నాణ్యమైన , సమాన విద్యను అందించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని కోరారు. బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిబిఎఫ్ పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రికి విద్యార్థులు తల్లిదండ్రులు పోస్ట్ కార్డు రాసి ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి బి ఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్, కొమ్మాట బాబు, బాబు, కమలేష్, మహేష్ పాల్గొన్నారు

ప్రసన్న హరికృష్ణ కె ఓయూ జెఏసి పూర్తి మద్దతు



నవతెలంగాణ- కౌడిపల్లి

ప్రసన్న హరికృష్ణ కె ఓయూ జేఏసీ పూర్తి మద్దతిస్తుందని ఓయూ జేఏసీ కన్వీనర్ బొమ్మ కంటి సత్యపాల్, సాయి, ఎల్చాల వంశీకృష్ణ, పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు జాతీయ పార్టీలు మద్దతిస్తున్న అభ్యర్థులు ఆధిపత్య అగ్రవర్ణాలు కావడం కొన్ని దశాబ్దాలుగా ఒకే ఆధిపత్య కులం పోటీ చేస్తూ గెలుస్తూ వారికున్న రాజకీయ ఆర్థిక సామాజిక ఆధిపత్యంతో అత్యంత ఎక్కువ జనాభా కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రాతినిధ్యం లేకుండా చేయడం చూస్తున్నాం. ఇకనైనా మేల్కొని ఈ వర్గాల ఆధిపత్యానికి చరమగీతం పాడాలన్నా రు. అన్నీ తెలిసిన మేదావులు, పట్టబద్రులు,ఉద్యోగులు ఈసారి కచ్చితంగా మనలో ఒకడైన డా.ప్రసన్న హరికృష్ణ బహుజనుల ఆత్మీయ బంధువు ఓయూ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారుడు, వందలాది పోటీ పరీక్షల పుస్తకాల రచించి వేలాది మంది నిరుద్యోగులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ప్రొఫెసర్ తన 19 సంవత్సరాల సర్వీస్ ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టభద్రుల, ఉద్యోగుల, నిరుద్యోగుల,విద్యార్థుల, ఆశయ సాధనకై మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డా.ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత(1) ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రసన్న హరికృష్ణ గెలుపుతో బహుజనుల ఐక్యతను చాటాలని ఓయూ జేఏసీ పిలుపునిచ్చింది ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసి నాయకులు అనిల్ ప్రజాపతి, కోడూరు రఘు,రాజు ముదిరాజ్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్ లోపాయికార ఒప్పందం



నవతెలంగాణ-నర్సాపూర్

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బిఆర్ఎస్ పార్టీలు లోపాయికర ఒప్పందాలు పెట్టుకున్నాయని. రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ మండిపడ్డారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా జ్ఞానేశ్వర్ హాజరై మాట్లాడారు కాంగ్రెస్ పార్టీ మాత్రం విద్యావంతుడైన నరేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిపిందన్నారు. బిజెపి పార్టీ మాత్రం డబ్బులు ఉన్న వ్యక్తికి టికెట్ ఇచ్చి పోటీలో నిలిపిందన్నారు. బిజెపి అభ్యర్థి మారని పార్టీ అంటూ లేదని విమర్శించారు. బిజెపి అభ్యర్థిని గెలిపించేందుకు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలో పనిచేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజులను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్లే తాను చైర్మన్ అయ్యానని గుర్తు చేశారు.ఈ ఎన్నికలను ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకొని కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ సువాసిరెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు మల్లేశం, సుదర్శన్ గౌడ్, కృష్ణ, శ్రీనివాసరావు, నాయకులు నవీన్ గుప్తా, కమలాపుల్ సింగ్, లలిత నర్సింగ్ నాయక్ ,అశోక్ గౌడ్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జితేందర్‌ను సన్మానించి సత్కరించిన కృష్ణారెడ్డి.



నవతెలంగాణ-తూప్రాన్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ జన్మదిన వేడుకలు గురువారం హైదారాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. జితేందర్ జన్మదిన వేడుకలకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీగా అభిమానులు,నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ జన్మదిన సంబరాల్లో తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లికి చెందిన గజ్వేల్ నియోజవర్గం సేవాదళ్ అధ్యక్షులు తాడూరి కిష్టారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నీ అధికారంలోకి తేవడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. సేవాదళ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కిష్టారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హోర్డింగ్ కూలి పలువురికి గాయాలు

నవతెలంగాణ-తూప్రాన్

జాతీయ రహదారి 44పై ఇమాంపూర్ శివారులో డీసీఎం ఢీకొనడంతో కారుపై హోర్డింగ్ కూలి పలువురు గాయపడ్డారు. గురువారం హైదరాబాద్ వైపు నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం హైవే పై ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ హోర్డింగ్ ను అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది.అదే సమయంలో లొకేషన్ కోసం ఆగిన కారుపై హోర్డింగ్ పడడంతో ఆంధ్రప్రదేశ్ ఒంగోలుకు చెందిన ప్రియాంక స్వల్పంగా గాయపడింది. బోధన్ కు చెందిన డీసీఎం డ్రైవర్ మహమ్మద్ హలీంకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు.ఘటన స్థలానికి చేరుకున్న తూప్రాన్ పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టారు.

కవితను కలిసిన జాగృతి నాయకులు



నవతెలంగాణ-శివ్వంపేట

తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం తెలంగాణ జాగృతి మండల అధ్యక్షులు తాటికొండ నవీన్, సాత్విక దంపతులు కలిసి ఆశీస్సులు అందుకున్నారు. తెలంగాణ జాగృతి సంస్థలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్న మండలంలోని పాంబండ గ్రామానికి చెందిన నవీన్ గౌడ్ దంపతులు హైదరాబాద్‌లోని కవిత ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో తెలంగాణ జాగృతిని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కవిత సూచించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకై బీజేపీ శ్రేణుల ప్రచారం.



నవతెలంగాణ-శివ్వంపేట :

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి శాసనమండలికి పంపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ పార్టీ శివ్వంపేట మండల ఇంచార్జి అశోక్ సాదుల అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి సారద్యంలో గురువారం మండలంలోని గోమారం, నవాబ్ పేట గ్రామాలలో పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షులు పెద్దపట్లోరి వెంకటరెడ్డి, రాజుగౌడ్, కుమ్మరి అనిల్, కుక్కల శ్రీకాంత్, బాబూగౌడ్, చాకలి నాగరాజు, ఓంకార్ గుప్త, సాయిరాం గుప్త, వర్షిత్ గౌడ్, రోహిత్, వర్షిత్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
శుక్రవారం | 21 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

హెల్మెట్ ధరించండి.. లోనికి ప్రవేశించండి



నవతెలంగాణ-సిద్దిపేట

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి, హెల్మెట్ ధరించండి ఇది మన ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని మోటర్ వెహికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ సూచించారు. గురువారం రవాణా శాఖ కార్యాలయం వద్ద ప్రధాన గేట్ వద్ద కార్యాలయంలోకి వచ్చే మోటర్ వాహనదారులను హెల్మెట్ ధరించకుండా వచ్చిన వారిని హెల్మెట్ భద్రతా ట్రాఫిక్ నియమాలపై వారికి పలు సూచనలు చేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ఆర్టీవో కార్యాలయం వచ్చిన వారికి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణం ఎంత ముఖ్యమో గమ్యస్థానం చేరడం కూడా అంతే ముఖ్యమని, మోటార్ సైకిల్‌పై ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏట్టి పరిస్థితుల్లోనూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ మోటార్ సైకిల్‌కు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ ఎం. మనూ చౌదరి



నవతెలంగాణ-నంగునూరు

బాలికల వసతి గృహాల్లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అధికారుల ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ మండలంలోని గట్ల మల్యాల గ్రామంలోని షెడ్యూల్ కులాల బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో బాలికల డార్మెటరీ, వంటగది స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వంట సరుకుల సరఫరా ఎలా ఉందని ఏదైనా ఇబ్బంది ఉంటే తెలియజేయాలన్నారు. అలాగే మెనూ ప్రకారం అల్పాహారం వండేందుకు అవసరమైన వంట పాత్రల కొరత ఉంటే జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్సీ హాస్టళ్లలో పరిశీలించి వాటి కొనుగోలు కోసం ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఇంచార్జి ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి హమీద్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనంతో పాటు స్నాక్స్ కచ్చితంగా అందించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సరిత, ఎంపీడీవో లక్ష్మప్ప పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఆర్ఎస్‌పీ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర బుచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న స్వేరోస్ నెట్ వర్క్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్ కుమార్ గురువారం మృతురాలి గృహన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యుడు స్వేరోస్ నెట్ వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్ర సురేశ్ కుమారును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతురాలి చిత్రపటానికి పూలతో ఆర్ఎస్ ప్రవీన్ కుమార్ నివాలర్పించారు. ఆర్థోపెడిక్ వైద్యులు శ్రీనివాస్, స్వేరోస్ నెట్ వర్క్ జిల్లా కార్యవర్గ సభ్యులు, అయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన సాకలి భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మిత్రబృందం గౌరవ అధ్యక్షుడు దుబ్బుడు వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షుడు శిరబోయిన తిరుపతి యాదవ్, ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి రూ. 5వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతుని కుటుంబానికి అన్ని విధాల అందుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెంటే హరిప్రసాద్, చెన్నోజు రాజు, తుమ్మ గోపి, నాచగోని చందు, తుమ్మ వెంకట్, తుషాలపురం సత్తయ్య, పాల్గొన్నారు .

కళాశాలలో అటానమీ వ్యవస్థ అమలుపై వర్క్ షాప్



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక బాలుర హబ్‌లోని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తి(ఆటోనామస్) వ్యవస్థ అమలు విధానంపై వర్క్ షాప్ నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డాక్టర్ గోపాల సుదర్శనం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్వయంప్రతిపత్తి(ఆటోనామస్)వ్యవస్థ విధి విధానాలు, కార్యాచరణ, కొత్త కోర్సుల రూపకల్పన, సిలబస్ రూపకల్పన, ఎగ్జామినేషన్ సిస్టం విధివిధానాలను కళాశాల అధ్యాపకులకు అవగాహన కల్పించామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతి రావు, ఐక్యూఏసి %డ% ఆటోనమీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, అకడమిక్ కోఆర్డినేటర్ డా. కెప్టెన్ భవాని, ఎన్.సి.సి. కోఆర్డినేటర్ డా. మహేందర్ రెడ్డి, డా. అలివేలు, డా. మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బోరు బావిని ధ్వంసం చేసిన దుండగులు

- నిందితులను శిక్షించాలన్న రైతు ఆవేదన



నవతెలంగాణ-మిరుదొడ్డి

బోరు బావిని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించి, కొంత మేర ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అన్నదాత వాపోయారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మాజీ సర్పంచ్ గుల్ల పుష్ప-బాగులుకు చెందిన బోరు బావిలో గత రాత్రి గుర్తుతెలియని దుండగులు రాళ్లు వేసి ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. మోటర్‌కు ఉన్న క్లాంపులతో పాటు, వంకను బోర్ బావిలో వేయడం జరిగిందన్నారు. నూతనంగా బోరు వేసి 15 రోజులు కూడా కాకముందే ఇలాంటి చర్యలకు పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇదే విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు. తీవ్ర ఎండలతో ఇప్పటికే పంట పొలాలు ఎండుముఖం పడుతున్నాయన్న నేపథ్యంలో దుండగులు ఇలాంటి కక్షపూరిత చర్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-కొండపాక

పరీక్షలు సమీపిస్తున్నాందున విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని త్రీ టౌన్ ఎస్ఐ మల్లేశం, సిద్దిపేట షీటీమ్ ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత అన్నారు. కొండపాక మండలం బందారం ఉన్నత పాఠశాలలో షీ-టీం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతూ చదివిస్తున్నారని ఆ విషయాన్ని గుర్తు పెట్టుకుంటూ చదువులు సాగించాలన్నారు. సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాకు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన అభ్యసన సామాగ్రితో బోధనతో చేయాలి



నవతెలంగాణ-కొండపాక

బోధన అభ్యసన సామాగ్రితో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు తయారుచేసిన టీఎల్ఎంను పరిశీలించి పలు సూచనలు చేశారు. బోధన అభ్యసన సామాగ్రిని ఉపయోగించడంతో విద్యార్థులకు అనుభవ పూర్వక జ్ఞానం పెంపొందుతుం దన్నారు. ప్రతి పాఠశాలలో టీఎల్ఎం ద్వారా బోధన సాగాలని తెలిపారు.

ప్రపంచాన మాతృభాషను సజీవంగా నిలుపుదాం..!





నవతెలంగాణ-సిద్దిపేట

భాష మానవజాతి పెంపొందించుకున్న ఒక శక్తివంతమైన సాధనం. భాష వ్యక్తుల ఆలోచనలను, భావాలను వ్యక్త పరచడానికి తోడ్పడడమే కాకుండా వారి మధ్య మైత్రిని, సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పుతుంది. ఆధునిక ప్రపంచంలో పోటీ తత్వాన్ని ప్రోత్సహించే కారకాల్లో భాష ఒక వారధిలా ఉంటుంది. భాష లేకపోతే మానవుని వైజ్ఞానిక, సాంస్కృతిక వారసత్వం తరతరాలకు వ్యాప్తి చెందేది కాదు. భాష ఒక సమాజపు ఆలోచనలను, జ్ఞానాన్ని, విలువలను తెలియజేసే వాహకం.

భావవ్యక్తీకరణ వారధియే భాష.

భాష వికాసం ఒక నిరంతర ప్రక్రియ. సమాజపు అలవాట్లు, పరిస్థితులను బట్టి భాషా పరిణామం వేగంగా పుంజుకుంటుంది. అది ఎప్పుడూ స్థిరంగా ఉండదు. భాష ఒక జీవనది లాంటిది నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. భాషా ఆవిర్భావం ఏ ఒక్క వ్యక్తి చేతగానీ, ఏ ఒక్క కాలంలో గాని జరగలేదు. భాష తరతరాలుగా ఎందరో వ్యక్తుల కృషిచే ఏర్పడిన ఒక వ్యవస్థ. భాష నాగరికతలో ఒక ముఖ్యమైన అంశం. ఇది మనిషి పాశవిక స్థాయి నుంచి అత్యుత్తమైన మానవుని స్థాయికి చేరుకోవడానికి తోడ్పడుతుంది. భాష లేకుంటే మనిషి మనిషిగా సంపూర్ణ మనగడ పొందలేదు. వ్యక్తుల మధ్య ప్రసారమాధ్యంగానే కాకుండా భాష వ్యక్తి మూర్తిమత్వానికి ప్రతిబింబంగా నిలుస్తుంది. శిశువు భాష ద్వారానే ప్రాపంచిక విషయాలను తెలుసుకోగలుగుతాడు. మనిషి జీవితంలో ఇంతటి బహుముఖ ప్రాముఖ్యత కలిగిన భాష విద్యారంగంలో ప్రధానమైన భూమిక వహిస్తుంది. విద్య బోధన, అభ్యాసనకు సంబంధించిన అన్ని వ్యవహారాలు భాష ద్వారానే నిర్వర్తించబడతాయి.

భాషతోనే విద్యా ప్రక్రియ

భాష లేకుంటే విద్యా ప్రక్రియ సాధ్యం కాదు. విద్యార్థి జ్ఞాన సముపార్జనకు, మూర్తిమత్వ వికాసానికి భాషయే ఆధారం. సమాజపు గుర్తింపునకు భాషా ప్రాథమిక వ్యక్తికరణ. నేడు ప్రపంచం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆంగ్లం లాంటి పరభాషల మోజులో అనేక దేశాలు తమ మాతృభాష పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వలన క్రమక్రమంగా మాతృభాషలు మృత భాషలుగా మారిపోతున్నాయి. ఈ మృత భాష జాబితాలో తెలుగు భాష ఉండడం అత్యంత బాధాకరమైన విషయం. ఏ మాతృభాష అయితే దేశంలో నిర్లక్ష్యానికి గురవుతుందో అనగా మాతృభాష విద్యా బోధన జరగనట్లయితే ఆ దేశంలో ఆ భాష 40 సంవత్సరాలలో నశించిపోతుందని యునెస్కో తెలిపింది.

ప్రమాదపు అంచున మాతృభాషలు

మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష."తల్లి ఒడి బిడ్డకు తొలి బడి" తన తల్లి అని ఎవరు చెప్పకుండానే అప్రమయంగా అమ్మ అని బిడ్డ



ఎలా పిలుస్తుందో మాతృభాష కూడా సహజంగా అలాగే వస్తుంది.

యునెస్కోకు చెందిన సాంస్కృతిక విభాగం ప్రపంచంలోని అల్పసంఖ్యాక భాషల పరిరక్షణకై సభ్య దేశాలలో జాగృతిని కలుగజేయాలన్న ఉద్దేశంతో ప్రపంచ భాషల స్థితిగతులను వాటి మనుగడలను గురించిన అధ్యాయాన్ని 1994 సంవత్సరంలో మొదలుపెట్టింది. ఈ అధ్యాయంలో భాగంగా అంతరించిపోయే అవకాశం ఉన్న భాషలను గుర్తించి అట్లాస్ రూపంలో ప్రచురిస్తుంది. దీనినే 'ప్రమాదంలో ఉన్న ప్రపంచ భాషల అట్లాస్' అని అంటారు. ప్రపంచంలో సుమారు 7 దేశాల్లో, 230 భాషలు పూర్తిగా అంతరించాయి. ఇంకా 2500 భాషలు అంతరించే దశలో ఉన్నాయని యునెస్కో ప్రకటించింది. ఒక భాషను మాట్లాడే జనాభాలో 30శాతం మంది చదవకుండా మాతృభాషకు దూరమైతే కాలక్రమంలో ఆ భాష మృత భాషగా మారిపోతుందని యునెస్కో ఇటీవలే ప్రకటించింది. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రెండు వారాలకు ఒక భాష కనుమరుగైపోతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అందులో భాగంగానే భారతదేశంలో 40 భాషలు, మాండలికాలు అంతరించిపోయే జాబితాలో ఉన్నాయి. ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గదబ, నైకి, అనే గిరిజన తెగల భాషలు ఉండడం ఎంతో బాధాకరం. ప్రతి పౌరుడు అమ్మను కాపాడుకున్నట్టే అమ్మలాంటి మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనిషి మనగడ కోసం పరభాషలను నేర్చుకోవడం తప్పేం కాదు. కానీ అమృతం లాంటి అమ్మభాషను నిర్లక్ష్యం చేయకుండా పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి ప్రథమ కర్తవ్యం.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నేపథ్యం:

అమ్మలాంటి మాతృభాషను పరిరక్షించుకోవాలని భావనతోనే 1999 సంవత్సరంలో నవంబర్ 17న యునెస్కో 30వ మహాసభలో బంగ్లాదేశ్ ప్రజలు ఫిబ్రవరి 21 తేదీన మాతృభాష కోసం పోరాడి, అసులు బాసిన యువకుల త్యాగాల గుర్తుగా యునెస్కో ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది. తరువాత 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా చిన్నపెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక, వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మనమందరం జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలమని, బహు భాషల విధానాన్ని ప్రోత్సహించాలని, అది విశాల దృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుందని యునెస్కో తెలిపింది. అమ్మలాంటి మాతృభాషను కాపాడుకుంటూనే దానితోపాటు ఇతర భాషలన్నింటినీ నేర్చుకోవడం అనంత విజ్ఞానాన్ని పొందడానికి సరైన మార్గం.

బహు భాష విద్య ప్రాముఖ్యత.

బహు భాష విద్య సమ్మిళిత సమాజాలను ప్రోత్సహించడం, స్వదేశీ భాషలను సంరక్షించడంలో సహాయపడుతుంది. అందరి వ్యక్తులకు విద్యను సమ ప్రాప్యత మరియు జీవితాంతం నేర్చుకునే అవకాశాలను సాధించడానికి ఇది ఒక మూల స్తంభం అని చెప్పవచ్చు. 2024 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలలో ఇతివృత్తం "బహుభాషా విద్య అభ్యాసానికి, తరాల తరబడి అభ్యాసానికి మూల స్తంభ" ఇలా ప్రతి సంవత్సరం యునెస్కో ఫిబ్రవరి 21న ఒక థీమ్‌ను ప్రకటిస్తుంది. నేడు ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్ల మంది పిల్లలు, యువకులు ఇప్పటికీ పాఠశాలకు హాజరు కావడం లేదు. ప్రాథమిక అక్షరాస్యత నైపుణ్యాలు నేర్చుకోవడం లేదు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం 2024 సంవత్సరంలో సమ్మిళిత నాణ్యమైన విద్య , జీవితకాల అభ్యాసం పై సుస్థిర అభివృద్ధి లక్ష్యం, దేశీయ భాషలపై అంతర్జాతీయ శతాబ్దం (2022 -2032) లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం యునెస్కో లక్ష్యంగా పెట్టుకుంది. బహుభాష విద్య తరతరాలుగా అభ్యసించడానికి, సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవడానికి, భాషలను పునర్జీవనానికి ద్వారాలు తెరవడానికి ఎంతో దోహదం చేస్తుంది. డిజిటల్ అక్షరాస్యతకు బహు భాషా విద్య చాలా అవసర. బహు భాష విద్య జీవిత నైపుణ్యాలు సంపాదించడంలో ఎంతో సహాయపడుతుంది. భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతాం. బహుభాషల విధానాన్ని ప్రోత్సహించడం వలన అది విశాల దృష్టిని శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుంది.

మాతృభాషల మాధుర్యం.

మాతృభాష చక్కని మాధుర్యానికి, పలుకుబడులకు, నుడికారములకు పుట్టినిల్లు "దేశ భాషలయందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణ దేవరాయలు పలుకులు మాతృభాషాభిమానానికి మేలుకొలుపు లాంటిది. "తేనేతేటల నవకుంపు సోనలకును సాటియగును మా తెలుగు భాషమ తల్లి" అని సురవరం ప్రతాపరెడ్డి మాతృభాషను కీర్తించినారు. పాశ్చాత్య మేధావులు సైతం "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని మన తెలుగుభాష గొప్పతనాన్ని ప్రశంసించారు. నిజానికి మాతృభాష మమకారం మానవ సంబంధాలను బలంగా ముడి వేస్తున్నాయి. ప్రాశ్చాత్య సంస్కృతి, నాగరికత, భాషా ప్రభావాల వల్ల ప్రాంతీయ బేధాల్లో చక్కగా ఉన్నప్పటికీ అంతుచిక్కకుండా పోతున్నాయి. వ్యక్తుల మధ్య దూరం పెరుగుతుంది. మాతృభాష మూలాలు కలిగిన కుటుంబాల్లో మాత్రం మాతృభూమిపై వికసిస్తున్నాయి. తల్లి వంటి తెలుగు భాష తల్లడిల్లి పోతుంది. తనయులమైన తెలుగు వాళ్లమంతా అమృతం లాంటి అమ్మ భాషను రక్షించుకో వలసిన బాధ్యత మనందరి పైన ఉంది.



రచయిత
భామండ్ల రాజు
తెలుగు అధ్యాపకులు
గుర్రాలగొంది.
చరవాణి నెంబర్ 9966669313.

ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు పట్ల హర్షం



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని అక్కెనపల్లి గ్రామ రైతులకు వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీ సరిపోవడం లేదని, దీంతో తరుచూ విద్యుత్ సమస్య తలెత్తుతుందని ఇటీవల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును పలువురు రైతులు కలిశారు. హరీశ్ రావు వెంటనే స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ ఎస్ఈకి లెటర్ ద్వారా ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్ కెపాసిటీని పెంచుతూ మరోక ట్రాన్స్ ఫార్మర్ ను గురువారం ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా రైతు పాతూరి మల్లారెడ్డి మాట్లాడుతూ.. గతంలో 100 కె.వి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఉండేదని, ఈ ట్రాన్స్ ఫార్మర్ పై 28 మోటార్లు ఉండడంతో కెపాసిటీ సరిపోక పోవడంతో తరుచుగా కాలిపోవడం లాంటి సమస్యలు తలెత్తేవని తెలిపారు. ఈ విషయమై హరీశ్‌రావు ను కలిసి తమ సమస్యను వివరించగానే స్పందించారని, వెంటనే విద్యుత్ సమస్యను తీర్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి మరో 63 కె.వి ట్రాన్స్ ఫార్మర్ ను శాంక్షన్ చేయించి, అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు బద్దిపడగ వెంకట్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, అయిలయ్య, కొమురయ్య, తిరుపతి, మొండయ్య నర్సింలు, రాజయ్య తదితరులు ఉన్నారు.

టీపీటీఎఫ్ విద్యా సదస్సును విజయవంతం చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో బి.రాజులు రాష్ట్ర కౌన్సిలర్ (జెడ్పిహెచ్ఎస్ రిమ్మనగూడ ఉపాధ్యాయుడు) పదవి విరమణ సందర్భంగా ఆదివారం మార్చి 2న ప్రజ్ఞా గార్డెన్ గజ్వేల్లో జరుగు విద్యా సదస్సును విజయవంతం చేయాలని జోన్ కన్వీనర్ జే శ్రీనివాస్ కోరారు. ఈ సదస్సు ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ పేదవారికి నాణ్యమైన విద్య అందుటకు తోడ్పడుతుంది అని తెలిపారు. గురువారం విద్యా సదస్సు కరపత్రాలను జోన్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నరేందర్ విడుదల చేశారు. విద్యా సదస్సుకు వక్తలుగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసిం అరుణోదయ సాంస్కృతిక సమైక్య విమలక్క, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు నరసింహారెడ్డి హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు టీపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, సీనియర్ నాయకులు రామచంద్రం, పి.ఎల్లయ్య యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, వర్గల్ మండల అధ్యక్షులు పి నరసయ్య, రాయపోల్ మండల అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ బాధ్యతతో మాట్లాడాలి



నవతెలంగాణ-సిద్దిపేట

బీసీలలో ముస్లిం మైనార్టీలను చూపించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మాటలు సరికావని, బాధ్యతా యుతంగా మాట్లాడాలని ఆల్ బీసీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు శుక్రొద్దిన్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టడం సంతోషమని, తమ కులం వారు 10.8 శాతం ఉన్నారని తెలిసిందని, రాజకీయంగా, చట్టసభల్లో తమ జనాభా ప్రతిపాదికన అవకాశాలు కల్పించాలని రాజకీయ పార్టీలను కోరారు. తమ మైనార్టీలలో కూడా ఫార్వర్డ్ వారికి మాత్రమే లబ్ధి జరుగుతుందని, బ్యాక్వర్డ్ వారిని ప్రోత్సహించా లని ప్రభుత్వాన్ని కోరారు. రంజాన్ సమయంలో ముస్లిం ఉద్యోగులకు సా యంత్రం ఒక గంట ముందు ఇంటికి వెళ్లడా నికి ప్రభుత్వం వెసలబాటు ఇవ్వ డంపై కూడా బండి సంజయ్ మాట్లాడ డం బాధాకరమని అన్నారు. పట్టభద్రుల కరీంనగర్ ఎమ్మెల్సీ స్థానానికి నరేందర్ రెడ్డి బరిలో ఉన్నారని, ఈనెల 27న జరిగే ఎన్నికల్లో నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. నరేందర్ రెడ్డి గెలుపు కోసం అన్ని నియోజకవర్గాలలో ప్రచారం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన సంవత్సర కాలంలో నిరుద్యోగులకు 55 వేలకు పైగా ఉద్యోగాలను అందించి, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలబడ్డామని, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని పట్టభద్రులు గెలిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ కోరారు. పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో కలసి పట్టణంలోని పలు ప్రయివేట్ విద్యాసంస్థల్లో నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ చీకటి స్నేహం బయటపడిందని, బీజేపీని గెలిపించేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించుకొని, రాష్ట్ర సంక్షేమానికి పాటుపడాలన్నారు. ఈ నెల 22న సిద్దిపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల సభ ఉంటుందని, ఆ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, కాలీముద్దీన్, వాహిద్ ఖాన్, దాస అంజయ్య, వాహబ్, గోపి కృష్ణ, గాయశుద్దీన్, కొత్త మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెడి కేర్ రిచ్ సూపర్ స్పెషాలిటీలో సేవల పట్టిక లేదు

- మేఘన ఆసుపత్రిలో అనవసర సీజరియన్‌లు
- ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్



నవతెలంగాణ-సిద్దిపేట :

పట్టణంలోనీ మెడి కేర్ రిచ్ సూపర్ స్పెషాలిటీలో సేవల పట్టిక లేదని, మేఘన ఆసుపత్రిలో అనవసర సీజరియన్‌లు చేసినట్లు తమ పరిశీలనలో తేలిందని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వ న్ కుమార్ ఆదేశాల తో ప్రయివేట్ ఆస్పత్రులను పరిశీలించినట్లు తెలిపారు. ఆసు పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరం లేకున్నా పరీక్షలు నిర్వహించరాదని, ప్రతి హాస్పిటల్లో సేవలకు సంబంధించిన సూచిక బోర్డులను తప్పకుండా ప్రదర్శించాలని సూచించారు. అనవసర పరీక్షలు చేయ రాదని, ఫేక్ రిపోర్టులు ద్వారా చికిత్సలు నిర్వహిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింద న్నారు. అధిక ఫీజులు వేయరాదని, గర్భిణీ స్త్రీలకు హైరిస్కు లక్షణాలు లేకున్నా సిజేరియన్ చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చిందన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అనుసరించి సేవలు అందించాలని, ఎవరైనా చట్టాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారి పైన చట్ట ప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆసుపత్రుల యాజ మాన్యాలు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న లేదా రెన్యువల్స్ చేసుకోవాలన్న జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని, ప్రతి నెల హాస్పిటల్ లో నిర్వహించిన వివిధ ఆరోగ్య సేవలకు సంబంధించిన సమాచారాన్ని హెచ్ఐఎంఎస్ పోర్టల్ (ఆన్లైన్) ప్రతి నెల రెండవ తారీకు లోపల సమర్పించాలని, విరుద్ధంగా ప్రవర్తిస్తే హాస్పిటల్ సీజ్ , జరిమానా, డాక్టర్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ని రద్దుకై పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

బకాయిలపైనే ప్రధాన దృష్టి

- తాగునీరు పొదుపుగా వాడుకోండి
- మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య





నవతెలంగాణ-గజ్వేల్

మూడు నెలల పాటు మున్సిపల్ పరిధిలో బకాయిల వసూలు, తాగునీరు పంపిణీ, పారిశుధ్యం, తడి పొడి చెత్త, హరితహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతేకాకుండా పలు విషయాలపై మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యతో నవ తెలంగాణ ముచ్చటించింది.

నవతెలంగాణ: మున్సిపల్‌లో ఎన్ని బకాయిలు ఉన్నాయి..?

కమిషనర్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం రూ4. కోట్ల 76 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని వీటిలో రూ.2 కోట్ల 81 లక్ష వరకు వసూలు చేశాం. వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టినం.

నవతెలంగాణ: మున్సిపల్‌లో ఎన్ని గృహాలు, ఎన్ని రకాలుగా ఉన్నాయి..?

కమిషనర్: మున్సిపల్ పరిధిలోని గృహాలు 12,402 ఉండగా వ్యాపారుల సంస్థల గృహాలు 10,005 ఏర్పాటు చేసుకోగా వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకున్న షాపింగ్‌లు 874 ఉన్నాయి. అదేవిధంగా ఇండ్లు వ్యాపారం ఒకే చోట ఏర్పాటు చేసుకున్న 1523 వరకు ఉన్నాయి.

నవతెలంగాణ: నల్ల కలెక్షన్లు ఎన్ని ఉన్నాయి.?. ఇంతవరకు ఎంత బిల్లులు వసూల్ అయ్యాయి..?

కమిషనర్: మున్సిపల్ పరిధిలో 6, 596 నల్ల కలెక్షన్లు ఉండగా రూ.2 కోట్ల 57 లక్షలు బకాయిలు ఉన్నాయి. ఇందులో రూ.2 లక్షలు మాత్రమే ఇప్పటివరకు వసూళ్ల అయ్యాయి. మిగతా బకాయిలను వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

నవతెలంగాణ: ప్రభుత్వ కార్యాలయాలు ట్యాక్సీలు చెల్లిస్తున్నారా..?

కమిషనర్: మున్సిపల్ పరిధిలో మొత్తం 18 ప్రభుత్వ కార్యాలయం ఉండగా వాటి బకాయిలు. రూ.కోటి పది లక్షలు ఉన్నాయి. ఇందులో కేవలం కోర్టు, పోలీస్ శాఖ మాత్రమే ఇప్పటివరకు చెల్లించిం ది. మిగతా ప్రభుత్వ కార్యాలయాలకు సమాచారం ఇచ్చాము. త్వరలో చెల్లిస్తామని చెప్పారు.

నవతెలంగాణ: మున్సిపల్ పరిధిలో ఉద్యోగులు, కార్మికులు ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు..?

కమిషనర్: కార్మికులు 189 మంది పనిచేస్తుండగా అధికారులు, సిబ్బంది మరో 41 మంది ఉన్నారు. వీళ్ళ ద్వారా , నల్ల బిల్లులు, ఇంటి ట్యాక్సీలు వసూలు చేస్తున్నాం. మున్సిపల్ కార్మికుల ద్వారా పారిశుధ్య పనులు, అదేవిధంగా హరితహారం తదితర పనులను చేపడుతున్నాం.

నవతెలంగాణ: తాగునీటి సమస్య తలెత్తుతుందా..? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

కమిషనర్: వేసవికాలం అయినందున కొంత వరకు నీటి సమస్య వస్తుందని, దాని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటాం. రోజు కు 7.25 ఎల్ఎండి ద్వారా మెట్రిక్ లీటర్ల తాగునీరు అవసరం ఉంటుందని ప్రస్తుతం ఐదు మెట్రిక్ లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది. అయినా ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తడం లేదు. తాగునీరు పొదుపుగా వాడుకోవాలి. కొన్నిచోట్ల వృధాగా తాగునీరు పోతుం దని నీరును కాపాడే బాధ్యత అందరికీ ఉంది. తాగునీరు సమస్య వస్తే ఇబ్బందులు పడతాం. వచ్చిన నీరును వాడుకొని సరిపోయిన తర్వాత బాధ్యతగా నల్ల టాపును ఆఫ్ చేసుకోవాలి.

నవతెలంగాణ: ఎన్ని టన్నుల చెత్త సేకరణ చేస్తారు..?

కమిషనర్: రోజుకు 11 టన్నుల చెత్త సేకరణ చేస్తున్నాం. ఇందులో డ్రై 3.5 టన్నులను సేకరిస్తుండగా, వేటు 3.5, ఇతరుల నుంచి 2.5 టన్నుల చెత్త సేకరణ జరుగుతుంది

ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని నర్మేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం గ్రామంలో నిర్మాణంలో గల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీను సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో జరుగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత పని జరిగింది, ఎప్పటిలోగా ఫ్యాక్టరీ పనులు కంప్లీట్ అవుతాయని ఆరా తీశారు. ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ ప్రాసెసింగ్ షేడ్స్ బాయిలర్‌లు మే నెల లోపల కంప్లీట్ అవ్వాలని ఆదేశించారు. పవర్ ప్లాంట్ జూన్ మొదటి వారం వరకు పని పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని సివిల్స్, మెకానికల్ పనులు త్వరగా కంప్లీట్ చేసి ఫ్యాక్టరీను జూన్ మొదటి వారంలోగా రైతులకు అందుబాటులో తేవాలని ఆయిల్ ఫెడ్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, నిర్మాణ సంస్థ సైట్ మేనేజర్‌లను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ అధికారి సువర్ణ, ఉద్యాన శాఖ అధికారులు, నంగునూరు తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ లక్ష్మప్ప తదితరులున్నారు.

రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వడం హర్షనీయం



నవతెలంగాణ-సిద్దిపేట

2020 ఆగస్టు నుంచి గ్రామపంచాయతీ లేఅవుట్లలో ఆగిపోయిన రిజిస్ట్రేషన్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాట్ రిజిస్ట్రేషన్లకు అనుమతిని య్యడం హర్షనీయమని తెలంగాణ రియల్ ఎస్టేట్ జిల్లా కన్వీనర్ వట్టి పెల్లి రాజి రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ లేఔట్లు చేసి రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్న రియల్టర్లకు ఉపశమనం లాంటిదని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనుమతించారన్నారు. గ్రామపంచాయతీ లేఔట్లలో ఒక్కసారి కూడా రిజిస్ట్రేషన్ కానీ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని సుదీర్ఘకాలంగా ఉద్యమం చేస్తున్న తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ పోరాటం ఫలితంగా రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వడం సంతోషకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాతరాజు రాజు విజయ్ సేన, కంతెం శ్రీహరి, లింగం, లియాకత్, వలియోద్దీన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

-న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి స్వాతి రెడ్డి



నవతెలంగాణ-కొండపాక

ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి స్వాతి రెడ్డి అన్నారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కొండపాకలోని ఆనంద నిలయం వృద్ధాశ్రమాన్ని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి స్వాతి రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆనందనిలయంలోని వృద్ధులకు, బాలసదనంలోని బాలలకు చట్టాలు హక్కులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి చట్టరీత్యా వారికి అందుతున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది, లీగల్ ఏయిడ్ కౌన్సిల్ కృష్ణమోహన్ ,ఆనంద నిలయం ప్రతినిధులు పెద్ది వైకుంఠం, బెజగామ వెంకటేశం లోకదాలత్ సిబ్బంది వృద్ధాశ్రమంలోని వృద్ధులు బాల సదనంలోని బాలురు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

-ఆరుగురు జూదరులు అరెస్ట్



నవతెలంగాణ-కొమురవెల్లి

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్, కొమురవెల్లి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఆరుగురి జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నగదు స్వాదీనం చేసుకున్నారు. శుక్రవారం ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మర్రిముచ్చాల గ్రామ శివారులో బొడుగం బాల్ రెడ్డి వ్యవసాయ బావి వద్ద కొందరు పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, కొమురవెల్లి పోలీసులు సంయక్తంగా దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ.2107 నగదు, 05 ముబైల్ ఫోన్లు, 06 మోటర్ సైకిళ్ల స్వాదీనం చేసుకుని వారిని రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టు మెట్రిక్ ఉద్యోగులకు కన్వెన్షన్ జీవో వర్తింపచేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో ఔట్సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో పని చేస్తున్న తమకు కన్వెన్షన్ జీవో వర్తించే విధంగా చేసి, తమ జీతాలను ఇప్పించాలని అవుట్సోర్సింగ్ ఉద్యోగులు శ్రీకాంత్, బిక్షపతి, లక్ష్మి, కృష్ణలు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ.. బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో ఔట్సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో 49 మంది వర్కర్స్ పనిచేయగా, 28 మందికి మాత్రమే కంటిన్యూషన్ జీవో ఇచ్చారని, మిగతా 21 మందికి కూడా ఇవ్వాలని కోరారు. ఈ సమస్యపైన పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమస్య పరిష్కరించి, ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కల్యాణి, యశోద, డి.జ్యోతి, ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-కోహెడ

మండలకేంద్రంలోని షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు బస్వరాజు శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనె అభివృద్ధి సాధ్యమవుతుందని విద్యావంతులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బందెల బాలకిషన్, ముంజ తిరుపతి, తదితరులున్నారు.

ఎంజేపీ మహిళ గురుకులంలో చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-వర్గల్

మండలకేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళ గురుకులంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై నూతన చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని సూచించారు. తల్లి దండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిచారు. విద్యార్థులు ఎవరైనా వేధింపులకు, బెదిరింపులకు గొరైనట్లైతే తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు, లేని పక్షంలో 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. షీటీమ్, ర్యాగింగ్,పోక్స్ కో ,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి, గురుకుల ప్రిన్సిపల్ భాస్కర్ రావు, గజ్వేల్ షీటీమ్, ఎస్సై శ్రీ రాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.78 లక్షలు

-19 రోజుల్లో రూ. 78,31,047
-ఆలయంలో హుండీల లెక్కింపు



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం ఆలయ ఈవో కే. రామాంజనేయులు ఆధ్వర్యంలో హుండీలలోని కానుకలను లెక్కించారు. 19 రోజుల్లో మొత్తం రూ. 78,31,047 నగదు, 82 గ్రాముల బంగారు మిశ్రమం, 5 కిలోల 100 గ్రా వెండి మిశ్రమం, 130 విదేశీ కరెన్సీ నోట్లు, 13 క్వింటాళ్ల బియ్యం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. పరిశీలకులుగా సిద్దిపేట జిల్లాలోని శరభశ్వర దేవాలయ ఈవో రవికుమార్ రాగ శ్రీ లలిత సేవ ట్రస్ట్ సభ్యులు కానుకలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏఈఓ, బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష దినోత్సవం

నవతెలంగాణ-సిద్దిపేట

లాలి పాటవినుచు లాలిత్య భాష్యంబు
నేర్చినట్టి బిడ్డ నేర్పుగలిగి
అమ్మ భాషనందు కమ్మని పలుకులు
మరువకూడదెపుడు మాతృభాష


అమ్మ భాషలున్న అవని భాషలు వచ్చు
సొబగులన్ని గూర్చు సొంతభాష
అందమైన భాష హరివిల్లు చందాన
మధురమైన చోటు మాతృభాష.

కొలువు పెద్దదైన కోట్ల కాంతులిడినా
అమ్మ వొడిన నిద్ర అమృతమయము
భాషలెన్నివున్న బాసటై సాగేటి
మమత సమతలున్న మాతృభాష.

అక్షరాల తోడు శిక్షగా చూసినా
చూపుతుంది తెలుగు రూపమందు
మాటలొక్కటైన మార్పుకు వేషంబు
మనిషి జ్ఞానమందు మాతృభాష.

తెలుగు వున్నచోట వెలుగుల రవళులు
పూర్వ భాషగాను పూర్ణమయము
జగతి భాషలందు జాగృతంబు తెలుగు
మంచి పంచునెపుడు మాతృభాష.

-ఉండ్రాళ్ళ రాజేశం,
సిద్దిపేట.
-9966946084




ఊహలు తారుమారు..





- కాంగ్రెస్ సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో నిరుత్సాహం
- ఒకటి తలుచుకుంటే..మరోకటైందంటూ పెదవిరుపులు
- బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ తీరు అధ్వానమంటూ పలువురి కితాబు
- ఎన్నికల ఉత్తర్వులు వెలువడకముందే వ్యతిరేకత
- ఒక్కగ్రామానికే పరిమితమైన సంక్షేమ పథకాలు..!

ప్రభుత్వం మారితే బతుకులు బాగుపడుతాయి. అభివృద్ధి పేరునా దోపిడికి గురైన ప్రజాధనానికి అడ్డుకట్టవేయచ్చునని భావించిన ప్రజల ఉహలు తారుమారాయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలకు అలవాటు పడిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలందడంలో అలస్యమవుతుండడంతో అసంతృప్తికి లోనవుతున్నారు. ప్రభుత్వం మారితే వివక్ష తొలగిపోతుందనుకున్న ఊహలు కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనాధికారం చేపట్టిన అనతికాలంలోనే ఒకటి తలుచుకుంటే మరొకటైందంటూ ప్రజలు పెదవిరుపులు మొదలుపెట్టారు. గత పదేండ్లు పరిపాలన సాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన అధ్వానమంటూ ప్రజలు కితాబిస్తున్నారు. కాంగ్రెస్ శ్రేణుల్లో సైతం సమన్వయ లోపాలు తలెత్తడం, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన గ్యారంటీలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లే యత్నాలు కాంగ్రెస్ శ్రేణులు చేయకపోవడం అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకతను మూటగట్టుకోవడానికి కారణంగా చెబుతున్నారు. అక్రమ దందాల్లో తలదూర్చడం, తమకనుగుణంగా వ్యవహరించేల అధికార యంత్రాంగాన్ని మలుచుకుని మేం చెప్పిందే వేదం..మేం చేసినట్టు చూడడమే శాసనమే దోరణి అవలంబించడం ప్రజల అసంతృప్తికి మరొక ప్రధాన కారణమని మండలంలో విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అందించే సీఆర్ఎంఫ్, ఎల్ఓసీ వంటి ఆర్థిక సాయాలపై మండలంలోని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు వివక్ష చూపడం. ప్రజలను, కార్యకర్తలను పక్కనబెట్టి ఒకరిద్దరూ నాయకులు సూచించినట్టు ఎమ్మెల్యే వ్యవహరించడం వంటి పరిణామాలు మండల కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతను దిగజార్చుతున్నాయని అయా రాజకీయ పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో మండలంలోని మేజారిటీ ప్రజలు మండలంలోని బీఆర్ఎస్ శ్రేణుల వ్యవహార తీరును వ్యతిరేకించి మేజారిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి హస్తమందించిన నేడు అనతికాలంలో అంతే వ్యతిరేకతను మూటగట్టుకుని హస్తమందించలేని దుస్థితులు నెలకొన్నాయి. మండల కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలితో కింది స్థాయి శ్రేణుల్లో తీవ్ర నిరుత్సాహం ఏర్పడింది. దీంతో అధికార పార్టీ స్థానికంలో కుదేలయ్యే అవకాశాలు స్పష్టమవుతున్నాయి. ఎమ్మెల్యే ఇప్పటికైనా కాంగ్రెస్ శ్రేణుల అసంతృప్తికి గల కారణాలను సక్కదిద్దుతారా..? లేదానేది ప్రశ్నార్థకంగా మారింది.



నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నో ఆశలతో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పరిపాలనాధికారం కట్టబెట్టారు. పదేళ్లకు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా ప్రజలేన్ను కున్నారు. నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాల్సిన అధికార పార్టీ నాయకులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకుల మధ్య సమన్వయం లోపం ఒక్కెత్తయితే.. కనీస రాజకీయ పరిజ్ఞానం లేక పోవడం మరో ఎత్తుగా రాజకీయ పార్టీల నాయ కులు విశ్లేషిస్తున్నారు. శాసన సభ ఎన్నికల సమయం లో పెట్టుబడి దారుల కు ఎమ్మెల్యే పెద్దపీట వేయ డం, పదేళ్ల పార్టీకి నిబద్ధతతో పని చేసిన శ్రేణ ులను పక్కన బెట్టడం స్థానిక ఎన్నికల్లో తీవ్ర నష్టం చేకూర్చే అంశమే.

ముందే వ్యతిరేకత..

స్థానిక సంస్థల ఎన్నికల ఉత్తర్వులు వెలువడకముందే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై మండలంలోని మేజారిటీ ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. గత ప్రభుత్వం పదేళ్ల అనర్హులకు సంక్షేమ పథకాలందించి విఫలమవుతే.. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలందించడంలో విఫలమవుతోందని ప్రజలు చెబుతున్నారు. పరిపాలనాధికారం చేపట్టిన ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని, మంత్రి, ఎమ్మెల్యే పేరునా మండలంలోని పలువురు కాంగ్రెస్ శ్రేణులు అక్రమ దందాలకు తేరలేపారని విమర్శలున్నాయి.

గ్రామానికే పరిమితమైన సంక్షేమ పథకాలు..?

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలనాధికారం చేపట్టిన అనంతరం అర్హులకు సంక్షేమ పథకాలందించేల ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించింది. అనంతరం మరోసారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన పేరునా ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలు సేకరించింది. మరోసారి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా అందించడానికి గ్రామ సభలు నిర్వహించి మళ్లీ దరఖాస్తులు స్వీకరించి మండలంలో ఒక్క గ్రామాన్ని ఎంచుకుని సంక్షేమ పథకాల అమలు చేయడం అయా గ్రామాల ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి నేరుగా ఓట్లడగలేని పరిస్థితి నెలకొంది.

రిజర్వేషన్లపై సందిగ్ధం..!

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం అమలు చేయనున్న రిజర్వేషన్లపై అధికార పార్టీ, ప్రతిపక్ష నాయకులు సందిగ్ధంలో పడ్డారు. రిజర్వేషన్ల అంశం కొలిక్కిరాకపోవడంతో గత ఎన్నికల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికార పార్టీలోని ఆశవాహులుతీవ్ర నిరాశకు గురవుతున్నట్లు వినికిడి. ఎదిఎమైనా మండల కాంగ్రెస్ శ్రేణులు వ్యవహరిస్తున్న తీరు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు, గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసాను ప్రధానాస్త్రంగా ప్రతిపక్ష నాయకులు స్థానిక ఎన్నికల్లో వినియోగించుకుని వెళ్లనున్నట్లు సమాచారం.

విద్యార్థిని విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-తొగుట

విద్యార్థిని విద్యార్థులు చదువుపై పట్టు వదలకుండా దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. గురువారం తొగుట రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు చదువుపై పట్టు వదలకుండా దృష్టి సారించి మీరు కోరుకున్న ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థినిలతో కలిసి తరగతి గదిలో జరుగుతున్న పాఠాలను విన్నారు. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు, పరీక్షా సమయంలో భయం లేకుండా పరీక్షలు ఎలా వ్రాయాలో తెలిపారు. పాఠశాలలో త్రాగునీటి వసతి, భోజనశాల, విద్యార్థినుల పడక గదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహారం తయారు చేసే విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు.



తొగుట ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీలు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. రోగులు ఎంతమంది వస్తారని అడిగి తెలుసు కున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన చికిత్సలు అందిం చాలని అన్ని పరీక్షలు అందించాలని సూచించారు. రోగుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యులు వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

ఎస్ఎస్‌సీలో 100 శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలి

- మండల విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు



నవతెలంగాణ-దౌల్తాబాద్

2024- 2025 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ఉపాధ్యాయులు విద్యార్థులు కృషి చేయాలని దౌల్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు అన్నారు. గురువారం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతులు, విద్యార్థుల యొక్క జవాబు పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల్లో భాగంగా ఉదయం, సాయంత్రం ఖచ్చితంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధపాటు చేయాలని అన్ని సబ్జెక్టుల్లో సందేహాలను ఉపాధ్యాయులు వెనువెంటనే నివృత్తి చేయాలని వంద శాతం ఫలితాలు విద్యార్థులు సాధించేలా నిరంతరం కృషి చేయాలని సూచించడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా అభ్యాసనంలో వెనుకబడిన విద్యార్థులు ఉంటే ఇప్పటికి కూడా వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యాబోధన చేసినట్లయితే వారు తప్పకుండా ఉత్తీర్ణత సాధిస్తారని, ఆ విధంగా తగు చర్యలు ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట ఏసీసీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట మండలం పెద్దమాసాన్ పల్లి గ్రామానికి చెందిన బోదాసు శ్రీనివాస్(35) భార్యతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ హైదరాబాద్‌లో నివాసం ఉండేవాడు. ఇటీవల శ్రీనివాస్ అమ్మకు పట్టణంలోని కేసీఆర్ నగర్‌లో డబుల్ బెడ్ రూం రావడంతో తల్లితో కలిసి సిద్దిపేటలో నివాసం ఉంటున్నాడు. కాగా గురువారం ఉదయం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తాలో ఉన్న గ్యాదరి మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మాణం జరుగుతున్న ఓ ఇంటిలో శ్రీనివాస్ విగత జీవిగా పడి ఉన్నట్లు స్థానికులు సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీ, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. మృతుడి తలపై బలమైన రక్త గాయాలు గుర్తించామని, ఇరువురు వ్యక్తులు తలపడటంతో సంఘటన చోటు చేసుకున్నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మృతుడు శ్రీనివాస్‌పై చిన్న చిన్న దొంగతనాల కేసుల్లో ఇదివరకు పలు కేసులు నమోదు అయినట్లు ఏసీపీ మధు తెలిపారు.

రైటింగ్ నైపుణ్యాలపై వర్క్ షాప్ విజయవంతం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం, విద్యార్థుల పరిశోధన, అకడమిక్ రైటింగ్ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ప్రాజెక్ట్ రిపోర్ట్ రైటింగ్ ఒక-రోజు వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ప్రారంభ సభకు వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలచంద్రం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా అబ్రహం వర్క్‌షాప్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యా వృత్తిపరమైన వృత్తిలో నిర్మాణాత్మక పరిశోధన నివేదిక రచన ప్రాముఖ్యతను ఆమె నొక్కిచెప్పారు. ప్రారంభ సెషన్‌కు హాజరైన ఇతర. కమలా క్రిస్టియానా, డా. ఎం.ఎం. లక్ష్మి రిసోర్స్ పర్సన్, డా.రామకృష్ణ బండారు, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్. ప్రధాన వక్త అయిన డాక్టర్ రామకృష్ణ బండారు పరిశోధనా పద్ధతి, ప్రాజెక్ట్ నివేదికల నిర్మాణం అకడమిక్ రైటింగ్‌లో ఉత్తమ అభ్యాసాల గురించి అంతర్దృష్టితో కూడిన సెషన్‌ను అందించారు. అతను డేటా సేకరణ, విశ్లేషణ ప్రెజెంటేషన్ పద్ధతులపై ఆచరణాత్మక మార్గదర్శకత్వం అందించాడు, అధ్యాపకులు విద్యార్థులను వారి పరిశోధనా సాధనలను మెరుగుపరచడానికి ప్రేరేపించారు. వృత్తిపరమైన విద్యాపరంగా మంచి ప్రాజెక్ట్ నివేదికలను రూపొందించడంలో విలువైన జ్ఞానాన్ని పొందారు. ఇటువంటి సుసంపన్నమైన అభ్యాస అనుభవాన్ని అందించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ వర్క్‌షాప్ ఘనంగా ముగిసింది.

లేబర్ బోర్డు కమిషనర్‌ను వెంటనే నియమించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కారం కోసం లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించకపోవడం శోచనీయకమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చైర్మెన్‌ను నియమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సమస్యలను చెప్పుకోవడానికి సరియైన అధికారిని ఇప్పటి వరకు నియమించకపోవడం ఏంటని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించకపోవడం విడ్డూరం గా ఉందని అన్నారు. రూ.2 వేల కోట్లు లేబర్ బోర్డు వద్ద ఉన్న భవన కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే నిధులు కేటాయిం చుకునే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. కార్మికులు పడే కష్టాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తగిన ప్రాధా న్యత ఇవ్వాలని, ప్రమాదాలు జరిగితే తక్షణమే భీమ వర్తింప చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కార్మికుల పక్షాన మాట్లాడడం శుభ సూచకమని, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కార్మికుల సమస్యలను మంత్రి వెంటనే పరిష్కరించే దిశగా చూడాలని కోరారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఫ్యామిలీ బ్లూమ్ స్మార్ట్ లివింగ్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను తెలియజేయాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యామిలీ బ్లూమ్ స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట స్థానిక రంగదాంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నమస్కరించి, పుష్పాలతో పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ .రాజశేఖర్ మాట్లాడుతూ ఇట్లాంటి కార్యక్రమాలు విద్యార్థులకు మంచి భవిష్యత్తును తీర్చిదిద్దగలవని, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు గౌరవించడం అనేది మంచి సాంప్రదాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ బ్లూమ్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం అనేది అత్యున్నతమైన కార్యక్రమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ శ్రీధర్,శ్రీవిద్య గారు, ఏజీఎం మధుసూదనారెడ్డి, కోఆర్డినేటర్ రాంబాబు, ఎస్ బ్యాచ్ ఇంచార్జి హనుమాన్,ప్రైమరీ కోఆర్డినేటర్ మహాలక్ష్మి, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ సరిత, ఏవో రాము, విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం ఆన్లైన్లో పొందుపరచాలి

- జిల్లా సెక్టోరియల్ స్టాటిస్టికల్ ఆఫీసర్ యాలాల నర్సింలు



నవతెలంగాణ-దౌల్తాబాద్

పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమగ్ర సమాచారాన్ని ఆన్లైన్‌లో పొందుపరచాలని జిల్లా సెక్టోరియల్ స్టాటిస్టికల్ ఆఫీసర్ యాలాల నర్సింలు అన్నారు. గురువారం మండల కేంద్రం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి సమగ్ర సమాచారాన్ని ఆన్లైన్ లో ఎటువంటి పొరపాట్లు లేకుండా పొందుపరచాలని అన్నారు. డైస్ లో పాఠశాల అభివృద్ధి సూచికలు పాఠశాల స్థాయిలో తప్పకుండా నిర్వర్తిస్తూ అమలుపరచాలని సూచించడం జరిగిందన్నారు. అనంతరం మండల విద్యాధికారి గజ్జల కనకరాజు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులందరూ ఎక్కడ కూడా నిర్లక్ష్యం వహించకుండా ప్రతి సమాచారాన్ని ఆన్లైన్ లో పొందుపరచాలని జిల్లా నుంచి వచ్చిన నిర్ణీత సమయంలో ప్రతిదీ పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా అపార్ కార్డు పెండింగ్ లో ఉన్నటువంటి పాఠశాలలో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అఫ్జల్ హుస్సేన్, గోపాల్ రెడ్డి, బాసిత్, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, ముత్యంరెడ్డి, మండల వనరుల కేంద్రం సిబ్బంది శేఖర్, పెంటయ్య, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రైతు మృతి



నవతెలంగాణ- రాయపోల్

బోరు మోటర్ రిపేర్ చేయుటకు ట్రాన్స్ఫార్మర్ ఆఫ్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కి గురై రైతు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో గురువారం చోటు చసుకుంది. బేగంపేట పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. కౌలుకు తీసుకున్న భూమిలో బోరు మోటార్ రిపేర్‌కి రావడంతో అది బాగు చేయించడానికి మెకానిక్‌ని తీసుకెళ్లాడు. బోర్ మోటార్ రిపేర్ కి విద్యుత్ సరఫరాను నిలిపివేయడానికి ట్రాన్స్ఫార్మర్ ఆఫ్ చేయడానికి ట్రాన్స్ఫార్మర్ ను ముట్టుకోగానే ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దగ్గరలో ఉన్న రైతులు గమనించి చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య పిట్ల లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బేగంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.

నూతన వధువువదులను ఆశీర్వదించిన చెరుకు



నవతెలంగాణ-తొగుట: తుక్కాపూర్ గ్రామానికి చెందిన బర్రింకల రవి కూతురు మానస-కిరణ్‌ల వివాహానికి సిద్ధిపేటలోని వయోల గార్డెన్‌లో హాజరై నూతన వధూవరులను కాంగ్రెస్ దుబ్బాక నియోజక వర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, తొగుట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఊళ్లేంగాలా సాయి, తదితరులు పాల్గొన్నారు.

రేఖా గుప్తకు అభినందనలు తెలిపిన నరేష్ గుప్త



నవతెలంగాణ-గజ్వేల్ : ఢిల్లీ సీఎంగా ఆర్యవైశ్య మహిళ రేఖా గుప్తా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని గజ్వేల్ పట్టణ బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుడు నరేష్ గుప్తా అన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆర్యవైశ్య నాయకుడు బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు నరేష్ గుప్తా మాట్లాడుతూ.. బీజేపీ పార్టీలోనే అందరికి న్యాయం జరుగుతుందని, భారత ప్రధాని మోడీ నాయకత్వంలో భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆర్యవైశ్యులకు బీజేపీలో మంచి గుర్తింపు ఉంటుందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ప్రజలు బిజెపి వైపు ఉన్నారని అన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

గజ్వెల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిది 3 వార్డులో అనారోగ్యంతో బెదరమైన లక్ష్మినర్సింలు మృతి చెందారు. గురువారం మరణించిన విషయం తెలుసుకొని గజ్వెల్ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి వాళ్ళ కుటుంబం ను ఓదార్చి, వారికీ భరోసా కల్పించి ఆర్థిక సాయం చేసారు. నిరుపేద కుటుంబంలో జీవనం కొనసాగిస్తూ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకర మన్నారు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు. వారి వెంట సీనియర్ నాయకులు మర్కంటి కనకయ్య ముదిరాజ్, 3వార్డు అధ్యక్షులు శ్రీరాం మల్లేశం,గ్రామ పెద్దలు పాల్గొన్నారు .



నవతెలంగాణ- గజ్వేల్ : మండలంలోని కోమటి బండ గ్రామనికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉబ్బని నర్సయ్య ఆకస్మాత్తుగా మృతి చెందడంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మెన్ జే వెంకటేష్ గౌడ్‌తో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారికి ధైర్యం చెప్పి, పార్టీ అండగా ఉంటుందని, పార్టీకి చేసిన సేవను గుర్తు చేయడం జరిగింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్, గ్రామా పార్టీ అధ్యక్షుడు భాస్కర్, దుర్గ రెడ్డి, కార్యకర్తలు తదితరులున్నారు.

బీవీఆర్ఐటీలో 'బాహ సే ఇండియా 2025' ప్రారంభం

ఘనంగా పదో వార్షికోత్సవ వేడుకలు
వోల్వో, డైమ్లర్, ఏవీఎల్, అల్టైర్, టాటా మోటార్స్ వంటి ప్రముఖ ఆటోమోటివ్ సంస్థలు హాజరు





నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో ఈ బాహా సే ఇండియా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఇంజినీరింగ్ సృజనాత్మకత, అద్భుత ప్రదర్శనకు నిలయమైన 'బాహ సే ఇండియా 2025' మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గల బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (హ్యూమన్ రిసోర్సెస్) సిమోనా అడెలినా పోపోవిసీ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. గౌరవ అతిథులుగా శ్రవణ్ కుమార్, టెరిటరీ మేనేజర్, బీపీసీఎల్, హైదరాబాద్‌బీ మయాంక్ ధింగ్రా, అసిస్టెంట్ ఎడిటర్, ఆటోకార్ ప్రొఫెషనల్‌బీలు హాజరయ్యారు. బాలరాజు సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు, నిర్వాహక కమిటీ, బాహ సే ఇండియాబీ రవిచంద్రన్ రాజగోపాల్, వైస్ చైర్మన్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీబీ డాక్టర్ కె.సి. వోరా, సలహాదారు, బాహ సే ఇండియాబీ మనోనీత్ సింగ్,



జాయింట్ కన్వీనర్, బాహ సే ఇండియాబీ ప్రణవ్ ఖటేకర్, కో-కన్వీనర్, బాహ సే ఇండియాబీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక అంతర్ కళాశాలల ఈవెంట్ సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ (ఎస్ఏఈ), శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్ఏఈ బాహ సే ఇండియాతో కలిసి నిర్వహిస్తుంది. ఈ ఏడాది బాహ సే ఇండియా పదో వార్షికోత్సవాన్ని నిర్వహిస్తుంది. విద్యుత్ వాహనాల అభివృద్ధికి, స్థిరమైన ఇంజినీరింగ్‌కు మార్గదర్శిగా నిలిచిన ఈ విభాగం, దేశవ్యాప్తంగా యువ ఇంజినీరింగ్ ప్రతిభను ప్రోత్సహించే ఒక గొప్ప వేదికగా మారింది. విద్యుత్ ఆధారిత ఆల్-టెర్రైన్ వాహనాల (ఏటీవీల) రూపకల్పన, తయారీ, పనితీరును పరీక్షించే ఈ పోటీ దేశంలోని ప్రతిభావంతులైన యువ ఇంజినీర్లకు అసాధారణ వేదికగా నిలుస్తుంది.

ఈ సందర్భంగా రెనాల్ట్ నిస్సాన్‌లతో పాటు బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సం, హైదరాబాద్ టెరిటరీ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఆటోలివ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ శివకుమార్ సుధాచంద్రన్, పరశురామ్ పాకాలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటోకార్ ప్రొఫెషనల్, అసిస్టెంట్ ఎడిటర్ మయాంక్ ధింగ్రా, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, బాహ సే ఇండియా అడ్వైజర్ డాక్టర్ కేసీ వోరా, బాహ సే ఇండియా జాయింట్ కన్వీనర్ మనోనీత్ సింగ్, కో కన్వీనర్ ప్రణవ్ ఖటేకర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దుబే డీజీఎం కాంతారావు మేనేజర్ పాపిరాజు తదితరులు పాల్గొన్నారు..

రైతు కూలీలతో కలెక్టర్ ముచ్చట్లు



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

మండల కేంద్రంలో కౌలు రైతు దడువాయి నర్సింలు రెండు ఎకరాలు సాగు చేస్తున్నారు ఆయన వ్యవసాయ పొలంలో కలుపుతీస్తున్న కూలీలతో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముచ్చటించారు. గురువారం మెదక్ చేగుంట ప్రధాన రహదారి పరిసర ప్రాంతంలో ఉన్న వ్యవసాయ పొలంలో మహిళా కూలీలు కలుపుతీస్తున్నారు. వాళ్ల వద్దకు వెళ్లిన కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎలాంటి పంటలు అధికంగా సాగు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పంటలు అధిక దిగుబడి సాధించాలంటే వ్యవసాయ అధికారులతో తగిన సూచనలు సలహాలు తీసుకోవాలని సూచించారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ రైతులకు తెలియజేశారు. సాగునీటి వసతి విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. పంటల సంరక్షణకు తీసుకుంటున్న రక్షణ చర్యలను రైతులు ఆయనకు వివరించారు. గ్రామాలలో తాగునీటి సరఫరా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జిల్లాలో వరి పంటలకు పురుగు సోకి నష్టం వాటిల్లే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించగా సస్యరక్షణ చర్యలపై ఆరా తీయడం జరిగిందని వ్యవసాయ అధికారులు నిత్యం రైతుల మధ్య ఉంటూ తగు సూచనలిస్తూ పురుగు మందులు పిచికారి చేసి పురుగు నివారణకు చేపట్టే చర్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఎరువులు పురుగు మందులు కొరతలేదని, మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పంట పొలాలను సందర్శించి సస్యరక్షణ చర్యలు అధిక దిగుబడును సాధించే విధానాలపై రైతులుకు అవగాహన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ





నవతెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లి మండలం రాయవరం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వ్యవహరించి పాఠాలు బోధించారు. డీఈవో లలితా శ్రీ, కలెక్టర్‌గా అక్షిత, ఎంఈఓగా బాబు, హెచ్ఎంగా జోసెఫ్, పీఈటీగా కృష్ణ మనోహర్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌గా వివాన్‌లతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. స్వయం పరిపాలనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు జయశ్రీ, అశోక్, స్వామి, శారద లు పర్యవేక్షించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నవతెలంగాణ-రాయపోల్

మండలంలోని వీరానగర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాల దినోత్సవంను గురువారం నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అథిదిగా మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి హజరై మాట్లాడుతూ.. ఒకరోజు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బాధ్యతలను స్వీకరించడంతో విద్యాబోధనలను తోటి విద్యార్థులకు అందజేయడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వై.ధనుష్, ప్రధానోపా ధ్యాయులు జి.వర్షిణి ఒకరోజు విధులు నిర్వహించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరీష, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, కవిత, సీఆర్పీలు యాదగిరి, స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరూప, ఉపన్యాస, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ మహమూద్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 13న భారత కోకిల సరోజినినాయుడు జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, ప్రభాకర్, నగేష్, స్వప్న, ఓదేలు, సద్గుణచారి, రమేష్, అమిత్, రవీందర్, సురేష్, సంతోష్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వధువు వివాహానికి పుస్తె మట్టెల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

నిరుపేద వధువు వివాహానికి మానవతా దృక్పథంతో పుస్తె మట్టెలు పంపిణీ చేసిన మానవత్వాన్ని చాటుకున్నారు. కొండం రాజ్ పల్లి గ్రామానికి చెందిన గడిపి సుజాత యాదయ్యల కూతురుకు యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బాగు శ్రీకాంత్ యాదవ్ సొంత డబ్బులతో చేయించిన పుస్తె మట్టెలను గురువారం టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అమ్మాయి తల్లి దండ్రులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు కొలుపుల బాలకిషన్, యువజన శాఖ అధ్యక్షులు మేక రజినీకాంత్, ముక్క సాగర్, సీనియర్ నాయకులు సుధాకర్, తిరుపతి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యారులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



నవతెలంగాణ-న్యాల్ కల్

మామిడిగి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించా లని అడాప్టర్ ఆఫీసర్ ఎంపీడీవో రాజశేఖర్ అన్నా రు. మామిడిగి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యాబోధన ఎలా కొనసాగుతుందో పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మార్చి 21వ తేదీ జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. 100% ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని అవగాహన కల్పించారు. ఉదయం సాయంత్రం జరిగే ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు రాస్తున్న ప్రాక్టీస్ టెస్ట్ 2ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు సమియోద్దీన్, గోవింద్ , బాలక్రిష్ణ , విద్యార్థులు ఉన్నారు ..

మేక్ ఇన్ ఇండియాకు టెస్లా తూట్లు..!

జర్మనీ నుంచి కార్ల దిగుమతి | భారత్‌లో విక్రయాలపైనే దృష్టి



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చెప్పుకొంటున్న మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి టెస్లా తూట్లు పెడుతోంది. ఆ కంపెనీ జపాన్‌లో తయారు చేసిన కార్లను రెడీమేడ్‌గా తెచ్చి భారత్‌లో విక్రయించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుందని రిపోర్టులు రావడమే ఇందుకు నిదర్శనం. ప్రపంచంలోని వివిధ దేశాల్లో కార్లు తయారు చేస్తున్న టెస్లా కంపెనీ ఇప్పట్లో భారత్‌లో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు సమాచారం. దిగుమతి చేసిన కార్లనే ఇక్కడ విక్రయించాలని భావిస్తోంది. జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని తమ అతిపెద్ద గిగా ఫ్యాక్టరీలో తయారయిన కార్లను భారత్‌కు ఎగుమతి చేయాలని యోచన. భారత ప్రభుత్వ కొత్త ఈవీ పాలసీ ప్రకారం విద్యుత్ కార్ల దిగుమతికి సంబంధించి రూ.4,150 కోట్ల పెట్టుబడులకు హామీ ఇస్తే 15 శాతం సుంకం మాత్రమే విధించనుంది. దీంతో ప్రతీ ఏడాది 8,000 వాహనాలను దిగుమతి చేసుకోవడానికి వీలుంది. దేశీయంగా తయారీలో స్థానికంగా ముడిసరకు సమకూర్చుకోవాలన్న నిబంధన కూడా ఉంది. కాగా.. బెర్లిన్‌లో టెస్లా వై మోడళ్లు తయారవుతున్నాయి. వీటిని తొలుత భారత్‌కు ఎగుమతి చేయాలని యోచిస్తోంది. టెస్లా ప్లాంట్‌ను ఎలాగైన తాము దక్కించుకోవాలని గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోటాపోటీగా ఉన్నాయి.

భారత్‌లో తయారీ ప్లాంట్ నెలకొల్పాలని టెస్లాకు ఓ దశలో యోచన ఉన్నప్పటికీ.. దానికి ట్రంప్ మోకాలడ్డు వేశారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు. ప్రపంచంలోని ప్రతీ దేశం తమను వాడుకోవాలని ప్రయత్నిస్తోందని ఎలన్‌మస్క్‌తో కలిసి పాల్గొన్న ఓ కార్యక్రమంలోనే ట్రంప్ వ్యాఖ్యానించారు. సుంకాలతో లబ్ధి పొందాలని చూస్తున్నాయని పేర్కొన్నారు. మస్క్ భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి సిద్ధం అవుతున్నారని.. ఇది ఆయనకు మంచిదే కావచ్చు కానీ.. అమెరికా పరంగా చూస్తే చాలా అన్యాయమేనని ట్రంప్ అనడం గమనార్హం. ఎలన్ మస్క్ ముందే ఈ వ్యాఖ్యలు చేయడంతో టెస్లా తయారీ యూనిట్‌ను భారత్‌లో నెలకొల్పడంపై నీలినీడలు కమ్ముకున్నాయని నిపుణులు భావిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయి నగరాల్లో రెండు షోరూమ్‌లు ఏర్పాటు చేసేందుకు టెస్లా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందుకోసం నియామకాల కోసం ప్రకటనలు కూడా జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇక గూగుల్ పే బాదుడు
కార్డ్ చెల్లింపులపై 1 శాతం రుసుం..

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక గూగుల్ పే తన వినియోగదారులకు షాక్ ఇచ్చింది. క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డులతో గూగుల్ పే నుంచి చేసే చెల్లింపులపై కన్వీనియన్స్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించింది. విలువను బట్టి 0.5 నుంచి 1 శాతం వరకు చార్జి వసూలు చేయనుంది. దీంతో ముఖ్యంగా కరెంట్ బిల్లులు, గ్యాస్ బుకింగ్ చెల్లింపుల వినియోగదారులపై భారం పడనుంది. ఇతర ఫిన్‌టెక్ సంస్థలు పేటీయం, ఫోన్‌పే సంస్థలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తోన్నాయి. ఇప్పటి వరకు ఉచితంగా అందించిన గూగుల్ పే కూడా ఇకపై బాదుడును షురూ చేసింది. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ వినియోగదారుడిపై రుసుం వసూలు చేసినట్టు జాతీయ మీడియాలో ఓ కథనం వచ్చింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పే వసూలు చేసినట్టు ఆ వ్యక్తి తెలిపారు. కాగా ఈ చార్జీలు అందరికీ వర్తిస్తాయా లేదా అనేది గూగుల్ పే స్పష్టం చేయాల్సి ఉంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ చార్జీలు వర్తించవని తెలుస్తోంది. గతేడాది నుంచే మొబైల్ రీచార్జీలపై రూ.3 వసూలు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12 వేల కోట్ల యూపీఐ చెల్లింపులు నమోదయ్యాయి.



హాబిటాట్స్ ట్రస్ట్ గ్రాంట్ తన 8వ ఎడిషన్ కోసం దరఖాస్తులు

నవతెలంగాణ : భారతదేశ సహజ ఆవాసాలు, స్వదేశీ జాతులను రక్షించేందుకు కట్టుబడిన లాభాపేక్షలేని సంస్థ హాబిటాట్స్ ట్రస్ట్, ది హాబిటాట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ తన 8వ ఎడిషన్‌ను ప్రారంభించామని ప్రకటించింది. ఈ ఎడిషన్ ముఖ్యాంశం ది హాబిటాట్స్ ట్రస్ట్ (THT) రీసెర్చ్ గ్రాంట్‌ను పరిచయం చేస్తుండగా, ఇది పర్యావరణ పరిరక్షణ, సామాజిక మరియు సాంకేతిక అంశాలపై ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యాన్ని కలిగి ఉంది. దరఖాస్తులు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 17 వరకు పంపించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఫైనల్స్‌కు చేరుకున్న వారి వివరాలను అక్టోబర్ 2025లో ప్రకటిస్తారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు www.thehabitatstrust.orgలో దరఖాస్తు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా పరిరక్షణ ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చేందుకు, ఈ ఏడాది చరిత్రలో అతిపెద్ద ఫండింగ్ సైకిల్ రూ.3.5 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. దరఖాస్తు సమర్పణ తేదీలు : ఫిబ్రవరి 15 నుంచి మార్చి 17, 2025 వరకు

కై ఇండియా నుంచి కాన్ ఫేస్ రేజర్

నవతెలంగాణ-హైదరాబాద్: వ్యక్తిగత వస్త్రధారణ ఉత్పత్తులలో సంస్థ కై ఇండియా కాన్ రేజర్ ను మహిళల కోసం అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. మృదువైన, మచ్చలేని మరియు ప్రకాశవంతమైన ముఖ చర్మాన్ని సాధించడానికి నొప్పిలేకుండా అప్రయత్నంగా పరిష్కారాన్ని అందించే ఒక విప్లవాత్మక సాధనం గా కై ఇండియా కెన్ రేజర్ నిలుస్తుంది అన్నారు. అసాధారణమైన అందాల సాధనాలను రూపొందించడంలో 116 సంవత్సరాల నైపుణ్యాన్ని కలిగి ఉన్న జపాన్ ప్రఖ్యాత కై బ్రాండ్ యొక్క భారతీయ అనుబంధ సంస్థగా, కై ఇండియా వ్యక్తిగత వస్త్రధారణ ప్రమాణాలను పెంచుతూనే ఉందన్నారు. కెన్ ఫేస్ రేజర్ వాడుకలో సౌలభ్యం కోసం రూపొందించబడిందనీ, చర్మం అంతటా అప్రయత్నంగా మెరుస్తూ, మృదువుగా, ప్రకాశవంతంగా మరియు అవాంఛిత జుట్టు నుండి విముక్తి కలిగిస్తుందని చెప్పారు.

టాబ్లెట్ ప్రీమియర్ లీగ్ 2025ను ప్రారంభించనున్న ఫ్లిప్‌కార్ట్

నవతెలంగాణ : భారతదేశంలోని ప్రముఖ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్‌లలో ఒకటైన ఫ్లిప్‌కార్ట్ ఈ సంవత్సరం ఫ్లిప్‌కార్ట్ టాబ్లెట్ ప్రీమియర్ లీగ్ 2025 (టిపిఎల్ 2025) యొక్క మొదటి ఎడిషన్‌ను ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం నుండి ప్రారంభించనుంది. గత విజయాల ఆధారంగా, టిపిఎల్ 2025, సరసత మరియు లభ్యత పట్ల ఫ్లిప్‌కార్ట్ యొక్క నిబద్ధతను కొనసాగిస్తుంది, అదే సమయంలో ప్రయాణంలో వినోదం కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తుంది. ఈ ఎడిషన్ అగ్రశ్రేణి టాబ్లెట్‌లపై పరిశ్రమ-ప్రముఖ డీల్‌లను అందిస్తుంది, దీని వలన వినియోగదారులు తమ బడ్జెట్‌ను పెంచకుండా వారి పరికరాలను అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. "స్క్రీన్ బడా, సీన్ బడా" అనే నేపథ్యంతో, వినోదం, విద్య మరియు ఉత్పాదకత టాబ్లెట్ అమ్మకాలకు కీలకమైన డ్రైవర్లు అని టిపిఎల్ 2025 హైలైట్ చేస్తుంది, ఓటిటి మరియు స్పోర్ట్స్ స్ట్రీమింగ్ వినియోగాన్ని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను నెలకొల్పిన SMFG ఇండియా క్రెడిట్

నవతెలంగాణ : భారతదేశంలోని 6 వేదికలలో 517 మంది అభ్యర్థులు పాల్గొనగా "అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం (బహుళ వేదికలు)" కోసం SMFG ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. కంపెనీ 7వ ఎడిషన్ పశు వికాస్ డే (PVD)లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన అతిపెద్ద ఒకరోజు పశువుల సంరక్షణ శిబిరాలు ద్వారా ఈ మైలురాయిని సాధించారు. ఈ శిబిరాలు 16 రాష్ట్రాలలోని 500 ప్రదేశాలలో ఏకకాలంలో నిర్వహించబడ్డాయి, దీనిద్వారా దాదాపు 1,90,000 మంది లబ్ధిదారులు (1,50,000 పశువులు మరియు 40,000 పశువుల యజమానులు) ప్రయోజనం పొందారు.



లయన్స్‌గేట్ ప్లేలో తెలుగు క్రైమ్ డ్రామా 'దక్షిణ'

నవతెలంగాణ-హైదరాబాద్: న్యాయానికి కొత్త పేరు ఉంది- ఏసీపీ దక్షిణ! లయన్స్‌గేట్ ప్లే తన అత్యంత ఉత్కంఠభరితమైన సౌత్ డిజిటల్ క్రైమ్ యాక్షన్ చిత్రం 'దక్షిణ'ను ఫిబ్రవరి 21న విడుదల చేస్తోంది. కఠినంగా వ్యవహరించే ఏసీపీ దక్షిణగా సాయి ధన్షిక (కబాలి ఫేమ్) నటించింది. వైజాగ్‌ను భయపెడుతున్న క్రూరమైన సీరియల్ కిల్లర్‌ను విశ్రాంతి తీసుకోకుండా వెంబడించడం, దర్యాప్తులో నేరస్థుడిని మాత్రమే కాకుండా ఆమె స్వంత ప్రవృత్తులు మరియు నమ్మకాలకు అతీతంగా ఎలా వ్యవహరిస్తుందో ఈ చిత్రం చూపిస్తుంది. కల్ట్ కాన్సెప్ట్ బ్యానర్‌పై ఓషో తులసి రామ్ దర్శకత్వం వహించి, అశోక్ షిండే నిర్మించిన ఈ దక్షిణ సినిమా, హై-స్టేక్ యాక్షన్ మరియు ఎమోషనల్ డెప్త్‌ను మిళితం చేసి, ప్రేక్షకులను వారి సీట్ల అంచున ఉంచేలా చేస్తుందనడంలో సందేహం లేదు.

'లవ్డ్ బై డివోటీస్'ను ప్రారంభించిన మేక్ మైట్రిప్

నవతెలంగాణ-హైదరాబాద్: భారతదేశంలో ఆధ్యాత్మిక ప్రయాణం ఎంతో అభివృద్ధిని చూసింది, యాత్రా గమ్యస్థానాలు ఇప్పుడు మేక్ మైట్రిప్ వారి మొత్తం గదుల రాత్రి బుక్కింగ్స్ Q3 ఆర్థిక సంవత్సరం 25లో 10% భాగస్వామం కలిగి ఉన్నాయి. ప్లాట్ ఫాంలో ఆధ్యాత్మికమైన గమ్యస్థానాల కోసం శోధనలు 2022తో పోల్చినప్పుడు 2024లో 46% పెరిగాయి, ఇది విశ్రాంత ప్రయాణాని కంటే విలక్షణంగా ఉండే ఎంతో అర్థవంతమైన మరియు ఆధ్యాత్మికంగా సుసంపన్నమైన ప్రయాణాల కోసం ప్రయాణికులలో పెరుగుతున్న ప్రాధాన్యతను సూచిస్తోంది. విశ్వాసం మరియు సంప్రదాయం అనుసరించే ఈ యాత్రికులలో తరచుగా కుటుంబంలోని వృద్ధ కుటుంబ సభ్యులు అధిక శాతంగా గల కుటుంబాలుగా ఉంటున్నాయి. తమ అవసరాలకు తగిన విధంగా సదుపాయాలతో ఉన్న సరైన బసను కనుగొనడం వారికి ప్రాధాన్యతగా మారింది. బసను గుర్తించడం సులభతరం చేయడానికి, మేక్ మై ట్రిప్ 'లవ్డ్ బై డివోటీస్' ను పరిచయం చేసింది, దీనిలో 26 ప్రముఖ ఆధ్యాత్మిక గమ్యస్థానాలలో 450౦ హోటల్స్ మరియు హోమ్ స్టేస్ యొక్క కలక్షన్ ఉంది. ఆధ్యాత్మిక ప్రయాణాల ప్రణాళిక ఊహలను తొలగించి ప్రయాణికులు సౌకర్యం, సౌకర్యం మరియు పొందడానికి తమ నిర్దిష్టమైన అవసరాలను కేటాయించే బసలను కనుగొనేలా ఇది హామీ ఇస్తుంది.

హైదరాబాద్ PW విద్యాపీఠ్‌లో ఆనంద రామన్‌తో పాటు 25 మంది సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు

నవతెలంగాణ-హైదరాబాద్: హైదరాబాద్‌లోని PW విద్యాపీఠ్‌లో తన విద్యా వనరులను బలోపేతం చేసుకునే లక్ష్యంతో విద్యా వేదిక ఫిజిక్స్‌వాలా (PW), ఆనంద రామన్‌తో పాటు 25 మంది సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులను నియమించుకుంది. ఆనంద రామన్ (మాజీ-FIITJEE డైరెక్టర్) విద్యార్థులకు రసాయన శాస్త్రాన్ని బోధించడంలో 20 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగి ఉన్నారు. హైదరాబాదులో జరిగిన ఒక వేడుక కార్యక్రమంలో ప్రకటించబడిన ఈ విస్తరణ, PW యొక్క ఎదుగుదల మరియు విద్యావిషయక వ్యూహానికి అనువుగా ఉంటుంది. ప్రస్తుతం, ఇప్పటికే నగరంలో మాదాపూర్, హబ్సిగూడ మరియు కూకట్‌పల్లిలో PW యొక్క విద్యాపీఠ్ కేంద్రాలు నెలకొల్పబడి ఉన్నాయి.

4,625 కుటుంబాల సర్వే పూర్తి
ఈ నెల 28 వరకు గడువు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో దఫా కుల గణనలో గురువారం వరకు 4,625 కుటుంబాల సర్వే పూర్తయిందని అధికారులు ప్రకటించారు. టోల్ ఫ్రీ నెంబర్ 040-2111111 ద్వారా 6,415, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో 4,227, వెబ్ సైట్ ద్వారా 398 కుటుంబాలు తమ పేర్లను నమోదు చేసుకున్నాయని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 2,254 గృహాల ఎన్యుమరేషన్, 1,091 కుటుంబాల డేటా ఎంట్రీ పూర్తయిందని తెలిపింది. గతేడాది నవంబర్ 6ననుంచి డిసెంబర్ 25 వరకు నిర్వహించిన కులగణన గణంకాలపై పలు అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ నెల16నుంచి 28 వరకు రీసర్వే నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో దఫా కులగణనకు ఇంకా ఎనిమిది రోజులు సమయం మిగిలి ఉంది.

ఇసుక తవ్వకాలు పెంచండి
భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను పెంచి ప్రజల అవసరాలకు తగినంత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భూగర్భ, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ ఎమ్‌డీతో కలిసి ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. మహదేవ్‌పూర్ మండలంలోని బొమ్మాపూర్, అన్నారం, పలుగుల, ఏలేశ్వరం, మద్దులపల్లి రీచ్‌లను సందర్శించి ఇసుక కాంట్రాక్టర్లు, స్థానిక గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కువ పరిమాణంలో ఇసుక తవ్వకాలు జరిపి, ప్రజల అవసరాలకు సరఫరాను పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన జయశంకర్ భూపాలపల్లితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి రెట్టింపు ఆదాయాన్ని పెంచడంతో పాటు, నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా అనుక్షణం పర్యవేక్షించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

గిరిజన జాతిని చైతన్యపర్చిన మహనీయుడు
సంత్‌సేవాలాల్ మహారాజ్

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన జాతిని చైతన్యపరిచేందుకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా భోగ్ బండారి హోమంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ కూడా హాజరయ్యారు. గిరిజన కళాకారుల ఆటపాటలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'బంజారా ధార్మిక వ్యాప్తి మహాసంఘ్' ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోగ్ భండారో హోమంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటంలోనూ, విదేశీయుల దండయాత్రల నుంచి దేశాన్ని కాపాడటంలోనూ ఆదివాసీ గిరిజనుల పాత్ర కీలకమని చెప్పారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ.. ప్రకృతిని కాపాడేందుకు ఆదర్శవంత జీవితాన్ని అందించింది ఆదివాసులేనన్నారు. విదేశీ రాజుల దురాక్రమణలతో బంజారాలు చెల్లాచెదురై, వ్యసనాలకు గురైన సమయంలో సేవాలాల్ వారి కోసం పనిచేశారని కొనియాడారు. బంజారాల సాధికారత అవసరాన్ని, చదువు గొప్పతనాన్ని, ఐకమత్యంగా ఉండాల్సిన ఆవశ్యకతను బోధించిన విషయాన్ని గుర్తుచేశారు. ధర్మ బద్ధంగా నడుచుకోవడం, ఆధ్యాత్మిక జీవనశైలిని అనుసరించడం, ప్రకృతిని, సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరాన్ని సేవాలాల్ మహారాజ్ ఆచరించి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం బంజారాలు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తున్నదని చెప్పారు. మహారాష్ట్రలోని నాగపూర్, ముంబైలలో సేవాలాల్ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. బంజారా బాషకు గుర్తింపు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో ఐకమత్యంతో ముందుకెళ్తూ.. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటుగా మతమార్పిడులకు బాధితులు కాకుండా చైతన్యవంతంగా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

ఏసీబీకి చిక్కిన ఎస్సీ కార్పొరేషన్ మేనేజర్
రూ.1 లక్ష నగదు స్వాధీనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థ మేనేజర్ బి. ఆనంద్‌కుమార్ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీజీపీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పై కార్పొరేషన్‌కు చెందిన పనులను పూర్తి చేసిన ఒక కాంట్రాక్టర్‌కు రూ.33 లక్షల బిల్లులను మంజూరు చేయటానికి గానూ మేనేజర్ ఆనంద్‌కుమార్ రూ.1.32 లక్షలను డిమాండ్ చేశారు. అయితే, ఇందులో రూ.1 లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు కాపుకాసి ఆనంద్‌కుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.1 లక్ష లంచం సొమ్మును స్వాధీనపర్చుకొని, నిందితుడిని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.



అదానీ కంపెనీ పనులు తక్షణమే నిలిపివేయండి

పర్యావరణ అనుమతులు లేవు..నిర్మాణం అక్రమం
మీర్జాపూర్ థర్మల్ పవర్ ప్లాంటుపై ఎన్జీటీలో పిటిషన్
నిర్మాణ పనులపై ట్రిబ్యునల్ అసంతృప్తి
ఆరోపణలపై యూపీ సర్కారు స్పందనను కోరిన బెంచ్

న్యూఢిల్లీ : యూపీలో అదానీ కంపెనీకి షాక్ తగిలింది. మీర్జాపూర్ జిల్లాలో నిర్మిస్తున్న వివాదాస్పద థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద జరుగుతున్న పనులను తక్షణమే నిలివివేయాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో ఒక పిటిషన్ దాఖలైంది. 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని అదానీ కంపెనీ ఇక్కడ చేపడుతున్నది. మీర్జాపూర్ థర్మల్ ఎనర్జీ (యూపీ) ప్రయివేటు లిమిటెడ్ అనేది అదానీ గ్రూపునకు అనుబంధంగా ఉంటుంది. తప్పనిసరైన పర్యావరణ అనుమతులు లేకుండానే ఇది సరిహద్దు గోడను నిర్మించిందనీ, భూమిని చదును చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నది.

ఈ పిటిషన్‌పై జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, జ్యుడిషియల్ సభ్యులు సుధీర్ అగర్వాల్, ఎక్స్‌పర్ట్ మెంబర్ సెంథిల్ వెల్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల ప్రిన్సిపల్ బెంచ్ విచారణ జరిపింది. అదానీ కంపెనీ చేపడుతున్న నిర్మాణంపై బెంచ్ అసంతృప్తిని వ్యక్తం చేసింది. నిర్మాణాన్ని ప్రారంభించటానికి పర్యావరణ అనుమతులున్నాయా అని అదానీ గ్రూపును శ్రీవాస్తవ ప్రశ్నించారు. అయితే, కంపెనీ తరఫున హాజరైన న్యాయవాది పర్యావరణ అనుమతులు లేవని సమాధానమిచ్చారు. సరైన అనుమతులు లేనపుడు ఈ పనులను ఎలా కొనసాగిస్తారని శ్రీవాస్తవ ప్రశ్నించారు.

ఈ పిటిషన్‌ను పర్యావరణవేత్త దేబాదిత్యో సిన్హా దాఖలు చేశారు. ఆయన తరఫున పరూల్ గుప్తా ఎన్జీటీ ముందు వాదనలు వినిపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాన్ని ఆపాలనీ, ఈ నిర్మాణం కారణంగా అక్కడి సైట్, వైల్డ్‌లైఫ్ డ్యామేజ్ అవుతున్నదని పరూల్ గుప్తా ఎన్జీటీని కోరారు. అదానీ గ్రూపు చేపడుతున్న నిర్మాణం అక్రమమని ఆరోపించారు. వృక్షసంపదను, అటవిని నిర్మూలిస్తున్నారని వివరించారు.అయితే, అఫిడవిట్ దాఖలు చేయాలని మీర్జాపూర్ థర్మల్ ఎనర్జీకి ఎన్జీటీ ఇప్పటికే చివరి అవకాశం ఇచ్చింది. అయినప్పటికీ.. అదానీ గ్రూపు అఫిడవిట్‌ను దాఖలు చేయకపోవటం గమనార్హం. కాగా, ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఎన్జీటీ ఆదేశించింది. ఈ కేసులో యూపీ కాలుష్య నియంత్రణ బోర్డు (యూపీపీసీబీ) భాగం కానందున.. అది సమర్పించిన నివేదికను ట్రిబ్యునల్ తిరస్కరించింది.

పోలీసు సామర్థ్యాన్ని పెంచే డ్యూటీ మీట్‌లు : రాష్ట్ర డీజీపీ జితేందర్
పతకాలు సాధించిన రాష్ట్ర పోలీసులకు అభినందన

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పోలీసులలో నిమిడీకృతమైన సామర్థ్యాన్ని డ్యూటీ మీట్‌లు రాటుదేలుస్తాయని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. జార్ఖండ్‌లో ఇటీవల జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన రాష్ట్ర పోలీసు బృందాన్ని గురువారం డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ డ్యూటీమీట్‌లో రాష్ట్ర పోలీసులు ఆరు బంగారు పతకాలను, నాలుగు వెండి పతకాలను, ఎనిమిది కాంస్య పతకాలను సాధించారని ఆయన అభినందించారు. పోలీసులు సాధారణంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో తలమునకలై ఉంటారనీ, ఈ నేపథ్యంలోనే తమలోని శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవటానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోలీసు డ్యూటీ మీట్‌లు గీటురాయిగా నిలుస్తాయని జితేందర్ వివరించారు. ఫోరెన్సిక్ సైన్స్, యాంటీ సబొటేజ్ చెక్, బాంబు సెర్చింగ్ స్క్వాడ్ విభాగాలలో రాష్ట్ర పోలీసులకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లభించినందుకు ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించి, సత్కరించారు. జార్ఖండ్‌లో జరిగిన ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్‌కు రాష్ట్రం తరఫున సీఐడీ డీజీపీ షికా గోయెల్, రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ డీఐజీ రమేశ్‌లు నోడల్ అధికారులుగా వ్యవహరించారు.

ఏపీలో గంట గంటకూ మోత

విద్యుత్ చార్జీల బాదుడు
చిరువ్యాపారులకూ టైమ్ అఫ్ డే విధానం అమలు
గృహవినియోగదారులకు మాత్రమే మినహాయింపు : ఎపిఇఆర్‌సి అనుమతి

అమరావతి : విద్యుత్ సంస్కరణల అమలులో మరో కీలక అడుగు పడింది. ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులు ఖాళీ చేసే మరో విన్యాసానికి రాష్ట్ర సర్కారు తెరతీసింది. అదే వినియోగదారుల 'పీక్ అవర్' అవసరాలపై ఛార్జీల కత్తి పెట్టడం! తప్పనిసరిగా విద్యుత్‌ను వినియోగించాల్సిన సమయాల్లో ఛార్జీల మోత మోగించడం! డిమాండ్‌ను బట్టి ఛార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతి ఇచ్చింది. దీంతో ఇప్పటివరకు హెచ్‌టి వినియోగదారులకు మాత్రమే పరిమితమైన ఈ 'టైమ్ ఆఫ్ డే ' విధానం ఇక నుంచి చిరువ్యాపారులకు కూడా అమలు కానుంది. గృహ వినియోగదారులను మాత్రం ప్రస్తుతానికి ఈ విధానం నుంచి మినహాయించారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహకాలను, రాయితీలను ఇస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లోనూ విద్యుత్ సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు అదనపు రుణాలతో పాటు పలు ఇతర రాయితీలనూ ప్రకటించింది. మరోవైపు విద్యుత్ సంస్కరణలకు తానే ఆధ్యుడినని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెప్పుకుంటున్న సంగతి తెలిసిందే. సంస్కరణల బాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరుగులు తీస్తున్న నేపథ్యంలో ఈ 'టైమ్ ఆఫ్ డే' లేదా 'పీక్ అవర్' ఛార్జీల మోత విధానం గృహ వినియోగదారుల తలుపు తట్టడానికి ఎక్కువ సమయం పట్టదన్న అభిప్రాయం వినపడుతోంది.

ఏప్రిల్ ఒకటి నుండి అమలు

టైమ్ ఆఫ్‌డే విధానం ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరం పీక్ అవర్ వినియోగంలో ఒక విధంగా, ఆఫ్ పీక్ అవర్‌లో మరోవిధంగా ఛార్జీలు వసూలు చేసుకోవడానికి వార్షిక ఆదాయ నివేదిక (ఎఆర్ఆర్) లో విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ఈ విధానానికి ఎపిఇఆర్‌సి అనుమతి ఇచ్చింది. దీనిప్రకారం స్వల్ప లోడ్(ఎల్‌టి) పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు కూడా ఈ పద్ధతిలో నూతన ఛార్జీలు అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు, సాయంత్రం ఆరు నుంచి పది గంటల వరకు పీక్ అవర్‌గా ఉంటుంది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు, రాత్రి 12 నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఆఫ్‌పీక్ అవర్‌గా ఉంటుంది. మధ్యాహ్నం మూడు నుంచి ఆరు గంటల వరకు, రాత్రి పది నుంచి 12 గంటల వరకు సాధారణ అవర్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఎల్‌టి వినియోగదారుల నుంచి 50 యూనిట్లలోపు వినియోగించే వారికి యూనిట్‌కు రూ.5.40లు, 51-100 యూనిట్లలోపు రూ.7.65, 101-300లోపు రూ.9.05, 301-500 మధ్య యూనిట్‌కు రూ.9.60, ఆపైన వినియోగించే వారికి రూ.10.15ల చొప్పున డిస్కంలు వసూలు చేస్తున్నాయి.

'స్మార్ట్' తప్పనిసరి...!

'వినియోగదారులు ఏ సమయంలో ఎంత విద్యుత్ వినియోగించారని తెలుసుకోవాలంటే స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లు తప్పనిసరి కానున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు ఈ ప్రిపెయిడ్ మీటర్లు అమర్చే కాంట్రాక్ట్‌ను అదానీ కంపెనీ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఆ సంస్థ రాష్ట్రంలో 59,21,344 మీటర్లను వినియోగదారులకు బిగించనుంది. ఇప్పటికే అధిక విద్యుత్ వినియోగించే పరిశ్రమలతో పాటు చిన్న వ్యాపారస్తులకు కూడా ప్రిపెయిడ్ మీటర్లను డిస్కంలు బిగిస్తోన్నాయి. అదానీ మీటర్ల కోసమే టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్ని విద్యుత్ సంస్థలు అమలు చేస్తున్నాయని విద్యుత్ నిపుణులు పేర్కొంటున్నారు. టిఒడి విధానం వల్ల వినియోగదారులపై అధిక భారాలు పడతాయని, ఈ విధానాన్ని అనుమతించొద్దని ఇఆర్‌సి నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎంతో పాటు ప్రజాసంఘాలు, పరిశ్రమలు కూడా డిమాండ్ చేశాయి. 2025 ఏప్రిల్, మే, సెప్టెంబర్, అక్టోబర్, 2026 ఫిబ్రవరి మార్చి నెలలను హైగ్రిడ్ డిమాండ్‌గా పేర్కొంది. 2025 జూన్ నుంచి ఆగస్టు వరకు, నవంబర్ నుంచి జనవరి వరకు లోగ్రిడ్ డిమాండ్‌గా విభజించింది.

చార్జీల్లో ఎలాంటి మార్పులేదు : ఇఆర్‌సి చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్



విద్యుత్ ఛార్జీలు పెంచబోవడం లేదని, గతంలో ఉన్న ఛార్జీలో ఎలాంటి మార్పు లేదని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్(ఎపిఇఆర్‌సి) ఇన్‌చార్జి చైర్మన్ ఠాగూర్ రామ్ సింగ్ తెలిపారు. తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన టారిఫ్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ.. మూడు డిస్కములు (ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్, ఇపిడిసిఎల్) ఏఆర్ఆర్ (మొత్తం రాబడి అవసరాలు) 58,868.52 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు ఇచ్చారని, (ఇందులో ఎస్‌పిడిసిఎల్ 22,830.44, సిపిడిసిఎల్ 12999.74, ఇపిడిసిఎల్ 23,038.34 కోట్లు). ఎపిఇఆర్‌సి 57,54.17 కోట్ల రూపాయలకు ఆమోదించిందని, రూ.1324.35 కోట్లు తిరస్కరించిందన్నారు. డిస్కంల ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసంగా ఉన్న 12,632.40 కోట్ల రూపాయలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జెన్కోల ద్వారా దిగుమతి చేసుకున్న బొగ్గులు సేకరించేందుకు ఆర్ఎస్ఆర్ (రైల్ సి రైల్) మోడ్ ద్వారా బొగ్గును రవాణా చేసేందుకు అనుమతించామన్నారు. కొత్త ఇంటి నిర్మాణం చేసుకునే వినియోగదారులకు డొమెస్టిక్ టారిఫ్ అమలు చేస్తామన్నారు. డెవలప్‌మెంట్ ఛార్జీలో 50 శాతం మాత్రమే చెల్లించి గృహ వినియోగదారులు అదనపు లోడు తీసుకునే క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. మార్చి ఒకటి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు వెంకటరమణారెడ్డి, డిస్కంల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, ఎకెవి భాస్కర్, కె సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.